# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 16-11-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 95 పేజీలు:4 వెల: రూ.1/-


## సుప్రీంలో శివకుమార్‌కు ఊరట!

**– ఈడీ దాఖలు చేసిన పిటీషన్‌ను కొట్టేసిన న్యాయస్థానం**

న్యూఢిల్లీ, నవంబర్15(ఆర్ఎన్ఎ) : కాంగ్రెస్ ట్రబుల్ షూటర్, కర్ణాటక మాజీ మంత్రి డీకే శివకుమార్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. మనీలాండరింగ్ కేసులో ఆయనకు ఢిల్లీ హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం శుక్రవారం కొట్టేసింది. మాజీ కేంద్రమంత్రి చిదంబరం కేసులో వాదననే ఎలాంటి మార్పులు చేయకుండా అచ్చుగుద్దినట్టు ఈ కేసులోనూ వినిపిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్, జస్టిస్ రవీంద్ర భట్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అక్టోబర్ 23వ తేదీన మనీలాండరింగ్ కేసులో ఢిల్లీ హైకోర్టు కాంగ్రెస్ నేత డీకే శివకుమార్‌కు బెయిల్ మంజూరు చేసింది. ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఈడీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. బెయిల్ పై వదిలితే ఆయన సాక్షులను ప్రభావితం చేస్తారని వాదనలు వినిపించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసింది ద్విసభ్య ధర్మాసనం. చిదంబరం కేసులో వినిపించిన వాదనలు తిరిగి ఇక్కడ ఎలా వినిపిస్తారని వాదనలు విన్న జస్టిస్ నారిమన్, జస్టిస్ రవీంద్ర భట్‌లు ఈడీపై ఆగ్రహం వ్యక్తి చేశారు. అంతేకాదు తనపై వచ్చిన ఆరోపణలను కొట్టివేయాలంటూ డీకే శివకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కు నోటీసులు ఇచ్చింది సుప్రీంకోర్టు. పౌరులతో వ్యవహరించే పద్ధతి ఇది కాదని జస్టిస్ ఆర్ఎఫ్ నారిమాన్ అన్నారు

## రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్లు దోషులే!

**– కోర్టు గత ఆదేశాలను వారు ఉల్లంఘించారు**
**– తేల్చిచెప్పిన సర్వోన్నత న్యాయస్థానం**

న్యూఢిల్లీ, నవంబర్15(ఆర్ఎన్ఎ) : జపాన్ ఫార్మా దిగ్గజం దైచీ దాఖలు చేసిన కేసులో రాన్‌బాక్సీ మాజీ ప్రమోటర్లు మాల్విందర్ సింగ్, శివిందర్ సింగ్‌లు కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని సుప్రీంకోర్టు తేల్చింది. జస్టిస్ రంజన్ గొగొయి నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ చేపట్టింది. ఫోర్టిస్ హెల్త్‌కేర్ లిమిటెడ్ నుంచి షేర్లను ఉపసంహరించుకోవద్దన్న కోర్టు గత ఆదేశాల్ని ఉల్లంఘించారని కోర్టు స్పష్టం చేసింది. 2008లో రాన్‌బాక్సీని దైచీ కొనుగోలు చేసింది. అయితే కంపెనీపై అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ దర్యాప్తు చేపడుతోందన్న నిజాన్నిదాచిపెట్టి రాన్‌బాక్సీ షేర్లను సింగ్ సోదరులు విక్రయించారంటూ దైచీ సంస్థ సింగపూర్ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన సింగపూర్ ట్రిబ్యునల్ సింగ్ సోదరులు దైచీ సంస్థకు రూ.4000 కోట్లు చెల్లించాలని 2016లో ఆదేశించింది. ఆ మొత్తం చెల్లించకపోవడంతో దైచీ.. భారత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు దైచీకి సొమ్ము చెల్లించే వరకు ఫోర్టిస్‌లోని షేర్లను ఎవరికి అమ్మొద్దని ఆదేశించింది. అయినా వారు తమ షేర్లని మలేషియాకు చెందిన కంపెనీకి విక్రయించడంతో దైచీ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై మార్చి 14న విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం మాల్విందర్ సింగ్, శవిందర్ సింగ్ డబ్బులు చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. డబ్బు చెల్లింపులకు సంబంధించిన ప్రణాళికను కోర్టుకు అందజేయాలని ఆదేశించింది. దీంతో సింగ్ సోదరులు ప్రణాళికను సమర్పించారు. అయితే, ప్రణాళిక అసంపూర్ణంగా ఉండటంతో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నేరుగా కోర్టు ధిక్కార పిటిషన్‌నే విచారిస్తామని హెచ్చరించింది. అయినా చెల్లింపుల్లో ఎలాంటి పురోగతి లేకపోగా, షేర్లను మలేషియాకు చెందిన కంపెనీకి విక్రయించడంతో నేరుగా కోర్టు ధిక్కారణ వ్యాజ్యంపై విచారణన జరిపిన సుప్రీంకోర్టు.. వారిద్దరూ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని తేల్చింది.

## నాలుగు పళ్ల దుకాణాలు దగ్ధం

హైదరాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): అనుకోకుండా జరిగిన అగ్నిప్రమాదంలో నాలుగు పండ్ల దుకాణ్యాలు దగ్ధం అయ్యాయి. తెల్లవారుజామున చెలరేగిన మంటలు నాలుగు దుకాణాలకు పాకాయి. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రైతు బాజార్ ముందు రోడ్డుపై ఉన్న పండ్ల దుకాణాల్లో ఈ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో హటాత్తుగా ఒక దుకాణానికి అంటుకున్న మంటలు సుమారు 4 దుకాణాల వరకూ వ్యాపించాయి. స్థానికులు అప్రమత్తమై మంటల్ని అదుపులోకి తెచ్చారు. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## రైఫిల్ షూటర్ విజేతలకు ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం

**క్రీడారంగానికి ప్రోత్సాహం:క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

హైదరాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఖతార్‌లో జరిగిన 14వ ఏషియన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రైఫిల్ షూటింగ్‌లో బంగారు పతకం సాధించిన అబిద్ అలీఖాన్‌కు, ఇషాసింగ్‌కు ఎయిర్‌పోర్టులో మంత్రి స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడారంగాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి పాల్గొన్న ఐదుగురు క్రీడాకారులు కూడా వివిధ స్థాయిలో పథకాలు సాధించడం గర్వకారణమన్నారు. రైఫిల్ షూటింగ్ క్రీడాకారులకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు.

## ప్రతి రంగంలో ఆవిష్కరణలు జరగాలి

**– విద్యార్థుల పరిశోధనలు నిలిచిపోకూడదు**
**– తెలంగాణ గవర్నర్ తమిళిసై**



హైదరాబాద్, నవంబర్15(ఆర్ఎన్ఎ) : ప్రతి రంగంలోనూ నూతన ఆవిష్కరణలు జరగాలని, విద్యార్థుల పరిశోధనలు నిలిచిపోకూడదని తెలంగాణ గవర్నర్ తమిళిసై అన్నారు. బయోటెక్నాలజీ రంగం ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ అవకాశాలపై శుక్రవారం హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో ఏర్పాటు చేసిన బయోటెక్నాలజీ సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. రోజు రోజుకూ జీవసాంకేతిక రంగంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. సరికొత్త విషయాపట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు. విద్యార్థుల పరిశోధనలు నిలిచిపోకూడదని ఆమె పేర్కొన్నారు. ప్రతి రంగంలోనూ నూతన ఆవిష్కరణలు జరగాలని అన్నారు. తనకు ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలోనే పెళ్లి అయిందని గవర్నర్ తెలిపారు. అయినప్పటికీ తన చదువును కొనసాగించానని అన్నారు. పెళ్లి అయిన తర్వాత కూడా ప్రతి అమ్మాయి తప్పకుండా చదవాలని, రోజురోజుకూ జీవసాంకేతిక రంగంలో మార్పులు వస్తున్నాయని ఆమె తెలిపారు. హైదరాబాద్‌కు గొప్ప చరిత్ర ఉందని, అంతేకాదు.. హైదరాబాద్ లో మెడికల్ సైన్సెస్, ఫార్మసీ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, సరికొత్త విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలని గవర్నర్ సూచించారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగిందని గవర్నర్ తమిళిసై అన్నారు. ప్రతీ నిత్యం కొత్తకొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు తనముతాము నిరూపించుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

## చివరి పనిదినాన్ని ముగించుకున్న సీజేఐ రంజన్ గొగోయ్



న్యూఢిల్లీ, నవంబర్ 15 : భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా తన చివరి పనిదినాన్ని జస్టిస్ రంజన్ గొగోయ్ శుక్రవారం ప్రత్యేకంగా ముగించుకున్నారు. తన ధర్మాసనంలో విచారణకు లిస్ట్ అయిన పిటిషన్లకు ఒకేసారి నోటీసులు జారీ చేశారు రంజన్ గొగోయ్. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంజన్ గొగోయ్‌కు సాయంత్రం 4 గంటలకు వీడ్కోలు పలకనున్నారు. ఈ నెల 17వ తేదీన రంజన్ గొగోయ్ పదవీ విరమణ పొందనున్నారు. మహారాష్ట్రకు చెందిన జస్టిస్ శరద్ అర్వింద్ బోబ్డే (63) ఈ నెల 17న చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ స్థానంలో భారత సర్వోన్నత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

**చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్**

అసోం రాష్ట్రానికి చెందిన జస్టిస్ రంజన్ గొగోయ్ 1978లో బార్ కౌన్సిల్‌లో చేరారు. న్యాయవాదిగా గౌహతి హైకోర్టులో ప్రాక్టీస్ చేసిన ఆయన 2001 ఫిబ్రవరి 28న శాశ్వత న్యాయమూర్తిగా నియితులయ్యారు. ఆ తర్వాత పంజాబ్–హర్యానా హైకోర్టుకు బదిలీ అయి కొద్దికాలానికి ఆ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ గొగోయ్.. 2012 ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. గతేడాది అక్టోబర్‌లో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ గొగోయ్.. ఆ పదవిని చేపట్టిన తొలి ఈశాన్య భారతీయుడిగా రికార్డులకెక్కారు. ప్రస్తుతం భారత 46వ ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతున్న జస్టిస్ గొగోయ్ ఈ నెల 17 పదవీ విరమణ చేయనున్నారు. జాతీయ పౌర రిజిస్టర్ (నేషనల్ సిటిజన్ రిజిస్టర్) కేసు సహా తన కెరీర్‌లో అనేక విశిష్ట కేసులను విచారించారు. గతేడాది జనవరిలో ఆయన సుప్రీం కోర్టులోని మరో ముగ్గురు న్యాయమూర్తులతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించి కేసుల కేటాయింపులో అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్‌మిశ్రా వ్యవహరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం పెను సంచలనం సృష్టించింది.

**జస్టిస్ ఎస్ఏ బోబ్డే**

మహారాష్ట్రకు చెందిన జస్టిస్ శరద్ అర్వింద్ బోబ్డే (63) ఈ నెల 17న చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ స్థానంలో భారత సర్వోన్నత న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 19 ఏండ్ల క్రితం అదనపు న్యాయమూర్తిగా బాంబే హైకోర్టులో చేరిన జస్టిస్ బోబ్డే.. ఆ తర్వాత రెండేండ్లకు మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2013 ఏప్రిల్ 12న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. దేశంలో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా కొనసాగుతున్న జస్టిస్ బోబ్డే పదవీకాలం 18 నెలల్లో ముగియనున్నది. జస్టిస్ బోబ్డే తన కెరీర్‌లో విచారణ జరిపిన కీలక కేసుల్లో అయోధ్య కేసుతోపాటు ఆధార్ ఆర్డినెన్స్ కేసు, పౌరుల వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన కేసు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూస్) రిజర్వేషన్ కేసు,ఆర్టికల్ 370 కేసు ముఖ్యమైనవి.

## ఢిల్లీలో ప్రమాదకర స్థాయిలో పొల్యూషన్

**– గాలినాణ్యత పెరగకపోతే సరి–బేసి విధానం కొనసాగిస్తాం**
**– ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్**

న్యూఢిల్లీ, నవంబర్15(ఆర్ఎన్ఎ) : ఢిల్లీలో పొల్యూషన్ ఏమాత్రం తగ్గడం లేదు. పంట వ్యర్థాలను తగలబెట్టడం తగ్గినా కాలుష్యం ఎఫెక్ట్ చూపిస్తోంది. ఢిల్లీలోని చాలా ప్రాంతాలు సివియర్ కేటగిరీలోనే ఉన్నాయి. లోధీ రోడ్ ఏరియా సహా కొన్ని ఇతర ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 500 పాయింట్లుగా చూపుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో 489 పాయింట్లు ఉంది. అంటే ఏమాత్రం తగ్గడం లేదు. మరోవైపు శుక్రవారం ఢిల్లీలో సరిబేసి రూల్ ముగియనుంది. ఈ రూల్ పెట్టినా పొల్యూషన్ తగ్గలేదు. శనివారం మళ్లీ సరిబేసి లేకపోతే అన్ని వాహనాలు రోడ్లపైకి వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో మరింత వాయు కాలుష్యం అవుతుందన్న వాదన ఉంది. అయితే సరిబేసి విధానాన్ని పొడగించాలా వద్దా అన్న విషయంపై కేజ్రీవాల్ అధికారులతో చర్చించారు. అత్యవసరం అనుకుంటే సరిబేసి రూల్ ను పొడగిస్తామని గతంలోనే సీఎం కేజ్రీవాల్ చెప్పారు. అయితే ఈ రూల్ బ్రేక్ చేసిన 4309 మందికి చలాన్లు విధించారు ట్రాఫిక్ పోలీసులు. ఒక్కొక్కరికి 4 వేల రూపాయల ఫైన్ విధించారు. మరోవైపు చాలా ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు ఆవరించి ఉంది. ఎయిమ్స్ రోడ్ ల ఉదయం పూట విజిబులిటీ కూడా చాలా తక్కువగా ఉండడం వాహనదారులు లైట్ల వెలుగులోనే ప్రయాణించాల్సి వచ్చింది. కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడుతూ..

వాతావరణశాఖ అధికారుల సమాచారం మేరకు రానున్న రెండు మూడు రోజుల్లో కాలుష్యం తగ్గి గాలి నాణ్యత పెరగనుందన్నారు. ఒకవేళ గాలి నాణ్యత పెరగకపోతే ఇప్పటికే అమలు చేస్తున్న వాహనాల సరి–బేసి విధానాన్ని కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. కాలుష్యం తగ్గి వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు మరో మూడు రోజులు సరి–బేసి విధానాన్ని పొడిగించనున్నట్లు పేర్కొన్నారు.

## యువకుడి వేధింపులకు వివాహిత ఆత్మహత్య

ఆసిఫాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): యువకుడి వేధింపులకు తోడు భర్త అనుమానించడంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కుమురం భీం జిల్లా జైనూరు మండలం కొండిబగూడ గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలివి.. కొండిబ గూడకు చెందిన రమాకాంత్‌కు నాలుగేళ్ల కిందట జైనూరు మండల కేంద్రంలోని శివాజీనగర్ వాసి సీత(24)తో వివాహం జరిగింది.

కూలీనాలీ చేస్తూ అన్యోన్యంగా కొనసాగుతున్న దంపతుల జీవితంలోకి అదే గ్రామానికి చెందిన బొడికే అనికేతన్ ఫోన్‌కాల్ ప్రవేశించడంతో చిచ్చురేగింది. తరచుగా సదరు వివాహితకు అనికేతన్ ఫోన్ చేసి వేధిస్తోండడంతో విసుగుచెందిన ఆమె అతణ్ని ఫోన్‌లోనే నిలదీసింది. కోపోద్రిక్తుడైన యువకుడు వివాహితపై ఆమె భర్తకు లేనిపోని మాటలు చెప్పి నమ్మించాడు. ఈ క్రమంలో ఈ నెల ఏడున రమాకాంత్ భార్యను నిలదీశాడు. ఇద్దరూ గొడవపడ్డారు. తనపై అకారణంగా నిందలు వేయడమే కాక ఫోన్ ద్వారా యువకుడు వేధింపులు ఆపకపోవడంతో సీత పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సీత కన్నుమూసినట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాపు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## రాచకొండ కమిషనరేట్ ప్రహరీ గోడ పనులకు భూమిపూజ



మేడ్చల్ మల్కాజ్‌గిరి, నవంబర్ 15: రాచకొండ కమిషనరేట్ నిర్మాణంలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణ పనులకు రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ నేడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు చామకూర మల్లారెడ్డి, జగదీష్ రెడ్డి, ఎంపీ రేవంత్ రెడ్డి, డీజీపీ మహేందర్ రెడ్డి, మేడ్చల్ జడ్పీ ఛైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, యాదాద్రి భువనగిరి జడ్పీ ఛైర్మన్ సందీప్ రెడ్డి, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ కోలేటి దామోదర్, ఎండీ మల్లారెడ్డి, సైబరాబాద్ సీపీ సజ్జనార్, రాచకొండ సీపీ మహేష్ భగవత్ తదితరులు హాజరయ్యారు.

## నిరసనల హోరు!

**– 42వరోజు ఉధృతంగా సాగిన ఆర్టీసీ కార్మికుల సమ్మె**
**– బైక్ ర్యాలీలు నిర్వహించిన కార్మికులు**
**– మంత్రి అజయ్ ఇంటి ముట్టడికి విఫలయత్నం**
**– కరీంనగర్‌లో కేసీఆర్ ఇంటి ఎదుట కార్మికుల ధర్నా**
**– ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

హైదరాబాద్, నవంబర్15(ఆంఎన్ఎ) : ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా సాగింది. సమ్మెలో భాగంగా 42వ రోజు కార్మికులు రోడ్లపైకి నిరసన తెలిపారు. ఉదయాన్నే బస్సు డిపోల వద్దకు చేరుకొని బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. శుక్రవారం జేఏసీ పిలుపుమేరకు కార్మికులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఖమ్మంలో నిర్వహించిన ఆర్టీసీ సమ్మె ఉద్రిక్తతలకు దారి తీసింది. ఐకాస పిలుపు మేరకు బైకు ర్యాలీకి సిద్ధమయ్యేందుకు ఖమ్మం బస్‌డిపోవద్ద కార్మికులు గుమిగూ డారు. అనంతరం ఒక్కసారిగా రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ క్యాంపు కార్యాలయం వైపు ర్యాలీ చేపట్టారు. తొలుత కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఆ తర్వాత కొంతమంది కార్మికులు క్యాంపు కార్యాలయం గేట్లు దూకి లోపలికి దూసుకెళ్లారు. మిగతావారు కూడా లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకు దిగిన కార్మికులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో ఆర్టీసీ కార్మికులు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇంటిని ముట్టడించారు. తీగలగుట్టపల్లిలోని సీఎం ఇంటి ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. మరోవైపు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోనూ కార్మికులు ఆందోళనలు కొనసాగించారు. వరంగల్–1 డిపో ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. బస్సులు బయటకు పోకుండా డిపో ఎదుట బైఠాయించి ఆందోళనలు చేశారు. నాయకులను చర్చలకు పిలిపించి, ప్రజారవాణాను కాపాడాలని డిమాండ్ చేశారు. బతుకుబండి నడిపేందుకు కార్మికులు అవస్తలు పడుతున్నారు. నిర్మల్ జిల్లా బైంసా డిపోలోని కండక్టర్లు, కండక్టర్లు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. డిమాండ్ల సాధన కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతూనే తాత్కాలికంగా ఇతర పనులు, కులవృత్తులు చేసుకుంటున్నారు. ఇళ్లు గడవడం కష్టంగా ఉందని కార్మికుల కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ దోయిలి యొగ్గుచు – తెలుగున
తీయని పలు చిత్రములను దీసిన ఘనుడౌ
"బీయన్ రెడ్డి"ని – దలచెద
మాయని ఘనమారుడను సినిమాపై నీడగన్ !!

*(నవంబర్ 16 బి.యన్. రెడ్డి జయంతి)*



–రాధశ్రీ
సెల్: 9494481210

## కుటుంబ కలహాలే హత్యకు కారణం

**బావమరిది హత్యపై పోలీసుల వివరణ**

ఆదిలాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): కుటుంబంలో కలహాలు రావడంతో ఎలాంటి గొడవలు లేకుండా సంతోషంగా ఉండాలని అక్క, బావకు సూచించాడు ఓ వ్యక్తి. బావమరిది తనకు నీతులు చెప్పడం ఏంటని భావించిన బావ ఏడాది క్రితం జరిగిన సంఘటనను మనసులో పెట్టుకొని అదును చూసి బావమరిది గొంతుకోసి హతమార్చాడు. ఈ దారుణ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒసావార్ సంతోష్, మమత దంపతులు ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. 14 ఏళ్ల క్రితం వివాహం జరిగిన వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో ఏడాది క్రితం మమత మహారాష్ట్రలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య వెళ్లిపోయిన కొంత కాలం తర్వాత తాను మారిపోయానని.. ఇకపై ఎలాంటి గొడవలు పెట్టుకోనని భార్యను నమ్మించి తిరిగి ఇంటికి తీసుకువచ్చాడు సంతోష్. అయితే ఏడాది క్రితం జరిగిన గొడవలో తన బావమరిది తగడపల్లి మనోజ్ తనకు నచ్చజెప్పడం సంతోష్‌కు నచ్చలేదు. ఈ క్రమంలో అక్కను చూసేందుకు మహారాష్ట్ర నుంచి మనోజ్ ఆదిలాబాద్‌కు వచ్చాడు. తేనీరు తాగుదామని బావమరిది మనోజ్‌ను బయటకు తీసుకువెళ్లిన బావ సంతోష్ పథకం ప్రకారం గొంతుకోసి నడిరోడ్డుపై దారుణంగా హత్యచేశాడు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. ఘటనా స్థలం వద్దకు పెద్ద ఎత్తున జనం రావటంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు, సీఐలు సురేష్, శ్రీనివాస్ అక్కడికి చేరుకుని ఘటనకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మనోజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు.

## కుదిరిన పొత్తు.. సీఎం శివసేన సైనికుడే..



ముంబయి , నవంబర్ 15: మహారాష్ట్రలో కొనసాగుతున్న రాజకీయ ప్రతిష్టంభనకు తెరపడినట్టేనా? అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ), కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు కుదిరినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. మూడు పార్టీలు కలిసి కనీస ఉమ్మడి ప్రణాళికను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ మూడు పార్టీల నాయకులు కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 288 సీట్లున్న మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో బీజేపీ–105, శివసేన–56, ఎన్సీపీ–54, కాంగ్రెస్–44 స్థానాల్లో గెలుపొందాయి.

**శివసేనకే సీఎం పదవి**

ఐదేళ్ల పాటు శివసేనకే సీఎం పదవి ఇవ్వాలని కనీస ఉమ్మడి ప్రణాళికలో పొందుపర్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, ఎన్సీపీకి డిప్యూటీ సీఎం పదవులు ఇవ్వనున్నారు. స్పీకర్ పోస్టును కాంగ్రెస్‌ను, కౌన్సిల్ చైర్మన్ పదవికి ఎన్సీపీకి కట్టబెట్టనున్నారు. మంత్రి పదవుల్లో శివసేనకు 14, ఎన్సీపీకి 14, కాంగ్రెస్‌కు 12 మంత్రి స్థానాలు దక్కనున్నాయి. ఈ క్రమంలో మూడు పార్టీలు కలిసి మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నాయి.

**ఐదేళ్లు కాదు.. 25 ఏళ్లు శివసేన సైనికుడే సీఎం : రౌత్**

మహారాష్ట్రకు ఈ ఐదేళ్లు కాదు.. రాబోయే 25 ఏళ్లు కూడా శివసేన సైనికుడే సీఎంగా ఉంటారని ఆ పార్టీ సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యులు సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. తాము అధికారంలోకి రాబోతున్నామని ఇవాళ ఉదయం ఆయన మీడియాతో పేర్కొన్నారు. శివసేన నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. గతంలో శివసేనతో కలిసిన పార్టీలో ఐదేళ్ల పాటు సుస్థిర పాలనను అందించాయని రౌత్ గుర్తు చేశారు.

## టిడిపి ముఖ్య నేతలతో చంద్రబాబు సమావేశం

అమరావతి, నవంబర్15,(ఆర్ఎన్ఎ): ఇసుక సమస్యపై పోరాటాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం అమరావతిలో పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఇసుక కొరతపై రాష్ట్రంలో తాజా పరిణామాలు, ఇతర రాజకీయ అంశాలపై చర్చించారు. చంద్రబాబు చేపట్టిన దీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల ప్రజల నుంచి విశేష మద్దతు లభించిందని నేతలు అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై పోరాటం దిశగా నేతలకు చంద్రబాబు పలు సూచనలు చేశారు. చంద్రబాబు చేసిన ఇసుక దీక్షపై విజయసాయి రెడ్డి ట్విట్టర్‌లో స్పందిస్తూ.. 'ఇసుక కొరత తీర్చాలంటూ చేసిన దీక్షలో మెడకు ఇసుక పొట్లాల దండ వేసుకున్నాడు. ఎప్పుడైనా కరువు పైన దీక్ష చేయాల్సి వస్తే ఎముకల హారం చుట్టుకునేలా ఉన్నాడు.

# తెలుగు భాష ఎందుకు బోధనా మాధ్యమం కారాదు?

నేటినిజం
శనివారం 16-11-2019

దేశ జనాభాలో తెలుగు మాట్లాడేవారి శాతం తగ్గిపోతోందన్నది ఆధికారిక నిర్ధారణ. ఇలా దేశభాషల మధ్య తెలుగుకు ప్రాధాన్యం తగ్గిపోతుండడం దశాబ్దుల విపరిణామం. "దేశభాషలందు తెలుగు లెస్స" అన్న ఘనమైన గత వైభవాన్ని తలచుకొని మురిసిపోయే తెలుగువారి సంఖ్య కూడ తగ్గిపోతోంది. తెలుగువారి హృదయ వైశాల్యం ఎక్కువ. ఈ వైశాల్యం విస్తరిస్తున్న కొద్దీ తెలుగుభాష ఆంగ్ల పదాలతో సంకరమైపోతోంది. దశాబ్ది పాటు దేశజనాభాలో తెలుగువారి జనాభా శాతం తగ్గినట్టు ధ్రువపడి ఏడేళ్లు గడచిపోయాయి. 2001లో దేశజనాభాలో 'తెలుగు మాతృభాష' అని చెప్పుకున్న వారి సంఖ్య 07.19 శాతం. ఈ సంఖ్య 2011 నాటికి 06.93 శాతానికి తగ్గిపోయిందట! అంటే 2001లో దేశంలోని ప్రతి పదివేల మందిలో ఏడు వందల పంతొమ్మిది మంది తెలుగువారు. 2011 నాటికి తెలుగువారి సంఖ్య ప్రతి పదివేలమందిలో ఆరువందల తొంబయి ముగ్గురు మాత్రమే! అంటే 2001-2011 సంవత్సరాల మధ్య ఇతర భాషల వారితో సమానంగా తెలుగువారి సంఖ్య పెరగలేదు. పెరిగి ఉండినట్టయితే దేశంలో 2011 నాటికి దాదాపు మరో ముప్పయి మూడు లక్షల మంది తెలుగువారు అధికంగా ఉండేవారు. తెలుగువారు కుటుంబ సంక్షేమ కార్యక్రమంలో అగ్రగామిగా ఉండడం వల్ల సంఖ్య తగ్గి ఉండవచ్చునన్నది ఒక తర్కం. కానీ తెలుగుసీమలకు ఆవల ఉన్న ప్రవాసాంధ్రుల సంఖ్య కూడ ఈ పదేళ్లలో ఎందుకని తగ్గినట్టు? పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో కలసిన అఖండ భారత్‌లో హిందీ భాషా జన సముదాయం అతి పెద్దది. తర్వాతి స్థానంలో బెంగాలీ ప్రజలుండేవారు. తెలుగువారిది మూడవ స్థానం. 1947లో దేశ విభజన జరిగిన తర్వాత బెంగాలీ ప్రజల్లో అరవై శాతం తూర్పు పాకిస్తాన్- బంగ్లాదేశ్-కు చెందినవారయ్యారు. అందువల్ల అవశేష భారత్‌లో అనేక దశాబ్దుల పాటు హిందీ భాషా జన సముదాయం వారిది మొదటి స్థానం కాగా తెలుగువారిది ద్వితీయ స్థానమైంది. కానీ 2011 నాటికి బెంగాలీ భాష మళ్లీ ద్వితీయ స్థానాన్ని ఆక్రమించింది. ఇందుకు కారణం బంగ్లాదేశ్ నుంచి శరణార్థులు, అక్రమ ప్రవేశకులు కూడ మన దేశంలోకి రావడం కావచ్చు. తెలుగుకు మూడవ స్థానం కూడ దక్కలేదు. మరాఠీ భాషకు మూడవ స్థానం దక్కింది. తెలుగు భాష నాలుగవ స్థానానికి దిగజారింది. ఇలా స్వభావ సాంకర్యాన్ని పొం దిన మన భాష స్వరూపం కూడ కుంచి ంచుకొని పోతోంది. స్వభావం ఆంగ్లపదజాలంతో సాంకర్యం కావడానికి ఏకైక కారణం విద్యావంతుల్లో మాతృభాషా స్వచ్ఛతను పరిరక్షించాలన్న శ్రద్ధ లేకపోవడం. గ్రామీణులు, బ్రిటన్ విద్యా విధాన ప్రభావ గ్రస్తులు కానివారు నిన్న మొన్నటి వరకూ స్వచ్ఛమైన తెలుగును మాట్లాడేవారు. అయితే ఇంగ్లీషులో మాట్లాడడం, కనీసం తెలుగు మాట్లాడేటప్పుడు ఆంగ్ల పదాలను ప్రయోగించడం గొప్ప అన్న భ్రమ దశాబ్దుల తరబడి తెలుగువారిలో కొనసాగుతోంది. విద్య అంటే విజ్ఞానం, సంస్కారం, వినయం, సౌశీల్యం. ఇలాంటి విద్యను పొందడానికి ఆంగ్ల మాధ్యమం ద్వారా ఎంత అవకాశం ఉందో భారతీయ భాషల ద్వారా పొందడానికి అంతే అవకాశం ఉంది. నిజానికి ఇంకా ఎక్కువ ఉంది. ఎందుకంటే సంస్కృత భాష ద్వారా లక్షల ఏళ్లుగా వికసించిన భారతీయ విజ్ఞాన సర్వస్వం దేశ భాషల్లో నిహితమై ఉంది. అందువల్లనే సంస్కృత భాష ద్వారా, సంస్కృత భాషకు రూపాంతరాలైన హిందీ, మరాఠీ, తెలుగు, తమిళం వంటి భారతీయ భాషల ద్వారా విద్యలను గ్రహించి విజ్ఞానవంతులవుతున్నవారు భారతీయ స్వభావబద్ధులై జీవించగలరు. ఆంగ్లభాషా మాధ్యమ బోధనాగ్రస్తులు క్రమంగా భారతీయతకు దూరమైపోయి బ్రిటన్ నాగరికతా నిబద్ధులవుతున్నారు. ఆసేతు శీతనగం అన్ని భారతీయ భాషలూ సంస్కృత భాషకు రూపాంతరాలు, అందువల్ల దేశభాషల్లో ఏది పెరిగినా ఏమంత ప్రమాదం లేదు. కానీ అన్ని భారతీయ భాషలనూ 'బ్రిటన్' భాష దిగమింగతోంది. ఇదీ భయంకర ప్రమాదం... తెలుగుతో పాటు అన్ని భారతీయ భాషలు బతికి బట్టకట్టాలంటే ప్రాథమిక మాధ్యమిక విద్యాబోధనను భారతీయ భాషల మాధ్యమంగా మాత్రమే జరపాలి. కేంద్ర ప్రభుత్వం పూనుకొని ఈ మేరకు రాజ్యాంగ సవరణ చేయాలి. బ్రిటన్ దీవులకు పొరుగున ఉన్న జర్మనీ, పోలెండ్, ఫ్రాన్స్, ఇటలీ వంటి ఐరోపా దేశాల్లో ఉన్నతోన్నత విద్యల బోధన ఆయా దేశాల మాతృభాషల్లోనే జరుగుతుంది. బ్రిటన్ వారి ఆంగ్లభాషను మిగిలిన ఐరోపా దేశాలవారు నెత్తికెత్తుకోవడం లేదు. మనం కూడ ఆంగ్లభాషను ప్రాథమిక స్థాయి నుంచి స్నాతకోత్తర స్థాయి వరకు అభ్యసించవచ్చు. కానీ అన్ని స్థాయిలలోను బోధనా మాధ్యమం మాత్రం భారతీయ భాషలే కావాలి. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఐరోపా భాషలు స్నాతకోత్తర పరిశోధక విద్యలకు మాధ్యమాలు కాగలినపుడు వేల ఏళుగా వికసించిన తెలుగు భాష ఎందుకు బోధనా మాధ్యమం కారాదు?

## సర్పంచ్‌ల భాగస్వామ్యంతో భూ సమస్యలకు చెక్

### క్షేత్రస్థాయి పరిశీలనలతో రైతులకు న్యాయం

వరంగల్,నవంబర్15(ఆర్ఎన్ఎ): గతంలో పటేల్ పట్వారీ వ్యవసథలో ఉన్నప్పుడు భూముల రికార్డులు సక్రమంగా సాగాయని, ఇప్పుడు మరోమారు రికార్డులు పదిలం కానున్నాయని రెవెన్యూ అధికారులు అంటున్నారు. గతంలో భూమి ఎవరి ఆధీనంలో ఉన్నా కనీసం రికార్డులు కొనసాగుతూ వచ్చాయి. పట్వారీ వ్యవస్థ రద్దు తరవాత ఆ రికార్డులను స్వాధీనం చేసుకుని వాటిని క్రోడీకరించడంలో నాటి పాలకులు విఫలమ్యారు. దానికి అప్పట్లో కొందరు అధికారులు తోడ్పాటు అందించారు. గ్రామాల్లో ఉన్న ప్రస్తుత రికార్డులను అటుఇటుగా చేయకుండా కేవలం క్షేత్రస్థాయి పర్యటనలతో పరిశీలించి తమకు అప్పగించిన పనులను పూర్తి చేయగలగాలి. ఇందులో సర్పంచ్‌ల పాత్ర కూడా కీలకమే. ఎవరి ఆధీనంలో ఎంత భూమి ఉందన్నది సర్పంచ్‌లకు తెలుసు. అందువల్ల వారిని కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని సూచిస్తున్నారు. వారు కూడా తగిన తోడ్పాటు అందించాలి. దీంతో సర్పంచ్‌లకు బాధ్యతలు పెరగడంతో పాటు గ్రామాల్లో వారికి గుర్తింపు కూడా వస్తుందని అంటున్నారు. రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం ఆసాంతం నిర్వహించే బాధ్యత జిల్లా కలెక్టర్లదే. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉంటున్న రెవెన్యూ అధికారులు తమ ప్రాథమిక విధి అయిన భూముల నిర్వహణను నిర్లక్ష్యం చేసారని గత అనుభవాలు, ప్రస్తుత అనుభవాలు తెలియ చేస్తున్నాయి. నిజానికి రెవెన్యూ రికార్డుల్లో ఒకలా, వ్యవసాయశాఖలో మరోలా భూముల వివరాలున్నాయి. రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడం వల్లనే ఈ సమస్య తలెత్తింది. కాబట్టి ఏ భూమి ఎవరి ఆధీనంలో ఉందో తేల్చి, భూమి హక్కులపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం రైతుల వద్ద నుంచి వివిధ పనులకోసం లక్షల ఎకరాలు సేకరించింది. రైల్వే లైన్లు, ప్రాజెక్టులు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, స్కూళ్లు, దవాఖానలు, కాల్వలు నిర్మించడానికి వ్యవసాయ భూములు సేకరించి తీసుకున్నారు. ఇలా సేకరించిన భూముల వివరాలు రికార్డుల్లో నమోదు కాలేదు. ఇంకా ఆ భూములు రైతుల వద్ద ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అందుకే భూముల విషయంలో స్పష్టత రావాలి.భూమి రికార్డుల నిర్వహణ సరిగ్గా లేకపోవడం అనేక వివాదాలకు, గందరగోళానికి, ఘర్షణలకు దారితీసిన ఘటనలు అనేకం ఉన్నాయి. సర్వేలో అన్ని నిగ్గుతేలితే సమస్యలు రావు. అందుకు గ్రామాల వారీగా సర్పంచ్‌ల సహకారంతో క్షేత్రస్థాయి పరిశీలన జరగాల్సి ఉంది

## మధ్యాహ్న భోజన అక్రమాలపై నజర్

### మెనూ పాటించడం లేదన్న ఆరోపణలు

### ఇకనుంచి ఖచ్చితంగా పథకం అమలుకు చర్యలు

హైదరాబాద్,ఫిబ్రవరి15(ఆర్ఎన్ఎ):ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకంలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు, విద్యాశాఖ అధికారులు కొందరు తప్పుడు లెక్కలతో విద్యార్థుల భోజనాలు బొక్కేస్తున్నారు. ఇక అలాంటి వారి ఆట కట్టించేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పర్యవేక్షణ లేకపోవటంతో జిల్లాల్లో చాలాచోట్ల మధ్యాహ్న భోజన నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. నాసిరకంగా భోజనం, కూరగాయల తయారీ ఉండటంతో చాలాచోట్ల విద్యార్థులు భోజనం చేసేందుకు ఆసక్తి చూపటం లేదు. అనేక చోట్ల మెనూ పాటించటం లేదు. వంట అయ్యాక పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రుచిచూడాలని నిబంధన ఉన్నా అమలు కావటం లేదు. ఇలాంటి సందర్భాల్లో ఆయా పాఠశాల యాజమాన్యాలు, మండల విద్యా సిబ్బంది కుమ్మక్కై నిధులు పక్కదారి పట్టిస్తున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం పథకం పక్కదారి పట్టకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలకు సిద్ధమైంది. ప్రతి నెలా వంట నిర్వాహకుల ఏజెన్సీ, ఖాతా నెంబర్, ఆయా మండలాల ఎమ్మార్సీల్లో నమోదు చేయించాలి. అలాగే విద్యార్థులు వివరాలు అందజేయాల్సి ఉంటుంది. పాఠశాలకు హాజరైన విద్యార్థుల నమోదును రోజూ నిర్ణీత సమయంలో తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆ సంఖ్యకనుగుణంగా మెనూ ప్రకారం అవసరమైన బియ్యం, పప్పు, కూరగాయలు తదితర సామగ్రి వంట నిర్వహణ ఏజెన్సీలకు అప్పగించాలి. వీటి పర్యవేక్షణ బాధ్యత అంతా ఆయా పాఠశాలలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులే చేయాలి. పౌరసరఫరాల శాఖ ద్వారా పాఠశాలకు పంపిన బియ్యాన్ని ప్రధానోపాధ్యాయుడే భద్రం చేయ్యాలి. బియ్యం నిలువ, లెక్కలు చూసుకోవాలి. రోజువారీగా వంట ఏజెన్సీకి ఇచ్చిన బియ్యం, మిగిలిన బియ్యం లెక్కలు సరాఫరా అయిన బియ్యంతో సరిచూసుకోవాలి. అలాగే రిజిస్టర్‌లో నమోదు చేసిన బియ్యం స్టాక్ వివరాలను అధికారులకు తనిఖీ సమయాల్లో అందుబాటులో ఉంచాలి. ప్రతీ పాఠశాల వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని, లేనిపక్షంలో బిల్లుల్లో జాప్యం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇక మెనూ ప్రకారం రుచిగా వండిపెట్టడంతో పాటు వివరాలను అధికారులకు ఎప్పటికప్పుడు ప్రధానోపాధ్యాయులు తెలియచేయాలి. ఇంటర్‌నెట్ ద్వారా వివరాలు తెలియచేయాలి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా మధ్యాహ్న భోజనం నిర్వహణ సరిగా జరగడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉన్నా, ఎక్కువగా చూపిస్తూ జిల్లాల్లో అనేక చోట్ల అక్రమాలకు పాల్పడుతున్నారు.

వీటికి అడ్డుకట్ట వేసేందుకు పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం వివరాలన్నీ ఇంటర్‌నెట్‌లో నమోదు చేసే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. సరకుల వివరాలు నెలవారిగా నెట్‌లో పంపితే ప్రభుత్వం ఆయా ఏజెన్సీల ఖాతాల్లో బిల్లులను జమ చేస్తుంది. నెలనెలా సక్రమంగా బిల్లులు అందించకపోవడంతో వంట ఏజెన్సీలు అప్పులు చేసి వడ్డిస్తున్నారు. ఆయా దుకాణాదారులు ఇచ్చింది పెట్టి భోజనంలో నాణ్యత లోపించింది. దీన్ని గమనించిన ప్రభుత్వం ఇన్ని రోజులుగా వంట ఏజెన్సీలు పడుతున్న ఇబ్బందులకు స్వస్తి పలకాలని భావిస్తుంది. దీంట్లో ఎక్కడైనా పొరబాట్లు జరిగితే వెంటనే సదరు నిర్వాహకుల ఏజెన్సీ రద్దుతోపాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడిపై చర్యలకు నిర్ణయించింది.

## కంట్రిబ్యూటరీ పెన్షన్ రద్దు చేయాల్సిందే

నిజామాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం(టీటీయూ) జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఈ విధానంతో ఉద్యోగులకు పెన్షన్ అన్నది లేకుండా పోయిందని ఆందోళన చెందారు. జిల్లాలోని ఉపాధ్యాయులతోపాటు విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. పాత పింఛను పునరుద్ధరణకు సంఘం కృషిచేస్తోందని చెప్పారు. కొత్తగా ఏర్పాటుచేసిన గురుకులాల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్తు పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి వారిని నియమించాలని విజ్ఞప్తిచేశారు. ఇదిలావుంటే

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అనేక ఆందోళనలకు పిలుపునిచ్చామని టీఎస్‌యుటీఎఫ్ నాయకులు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 31 సంఘాలను కలుపుకొని సీపీఎస్ రద్దుకు ఐక్యఉద్యమం కార్యాచరణతో ముందుకెళ్తున్నామన్నారు.

# ప్రజల కన్నీటితో చెలగాటాలొద్దు

హైదరాబాద్, నవంబర్ 15(ఆర్ఎన్ఎ):అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా సాగితేనే ప్రజలకు పట్టెడన్నం దక్కుతుంది. చిన్నాచితకా పనులు దొరికి జీవనం సాగిస్తారు. సమస్యలను గుర్తించి వాటిని తక్షణం పరిష్కరింప చేస్తూ ముందుకు సాగడం ప్రభుత్వ విధి. ఇసుక కొరత కావచ్చు...ఆర్టీసీ సమ్మె కావచ్చు..ప్రాజెక్టుల నిర్మాణాల సందర్భంగా భూసేకరణలు కావచ్చు..సమస్యలు కోకొల్లలు. వీటిని సంయమనంతో పరిష్కరించాలి. పెద్దమనసుతో పాలకులు ముందుకు నడవాలి. ఎపిలో ఇసుక కొరత కారణంగా ఇప్పటికీ నిర్మాణాలు ఆగిపోవడంతో అనేక గుండెలు ఆగిపోయాయి. ఇసుక ఆలస్యం కావడం ఓ పెద్ద కుట్రగా కనిపిస్తోంది. గతంలో ఎంతగా వర్షాలు కురిసినా ఇసుక అలభ్యత కనిపించలేదు. ఈ సమస్యపై వస్తున్న విమర్శలు లేదా ఆరోపణలను ప్రభుత్వం సానుకూలంగా తీసుకుని చర్యలు చేపట్టాలే తప్ప ఎదురుదాడికి దిగరాదు. ఇక తెలంగాణలో ఆర్టీసీ సమ్మెకు ముగింపు పలకాల్సిన ప్రభుత్వం తన ధోరణిలో దానిని ఓ వ్యతిరేక వ్యవహారంగా చూస్తోంది. దీనివల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పాలకులు ఇలాంటి సందర్భాల్లో ధృఢచిత్తంతో వ్యవహరించాలి. కార్మికులదే తప్పయినా ప్రభుత్వం పెద్ద మనసు చేసుకోవాలి. ప్రజలు పస్తులతో అలమటిస్తూ కొందరు... ఆత్మహత్యలు చేసుకుంటూ మరికొందరు...భయాందోళనలో మరికొందరు మరణిస్తుంటే మంచిది కాదు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా పోరాదు. కార్మికులు సమ్మె కారణంగా ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయాల్లోనే పాలకులు తమ విశాల దృక్పథంతో ముందుకు నడవాలి. ప్రజాహితాన్ని మించిన నిర్ణయం మరోటి ఉండరాదు. ప్రైవేటీకరణ మంత్రంతో ముందుకు పోతే ప్రజారవాణ దెబ్బతినగలదు. ప్రజలకు రవాణా వ్యవస్థను దూరం చేసిన వారం అవుతాం. ఇకపోతే వివిధ అభివృదద్ఇ కార్యక్రమాలకు భూ సేకరణ సందర్భంలోనూ కాఠిన్యం ప్రదర్శిస్తున్నారే తప్ప, భూములు ఇచ్చి, జాతి అభివృద్ధి కోసం తమ సర్వస్వాన్నీ ధారాదత్తం చేస్తున్న వారి త్యాగం గుర్తించడం లేదు.

దేశవ్యాప్తంగా భూసేకరణ కారణంగా నిర్వాసితులను పట్టించుకోవడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. దీంతో వారు తమకు అన్నం పెట్టే భూములను అప్పగించి రోడ్డు పాలవుతున్నారు. ఇలాంటి సందర్భాల్లోనూ ప్రజలు కన్నీరు పెట్టుకోకుండా ప్రభుత్వాలు ఉదారత ప్రదర్శించాలి. ఆయా ప్రాజెక్టులు చేపట్టిన సందర్భంలో భూములు, ఇల్లు కోల్పోయిన వారికి అందుకు తగ్గరీతిలో పరిహారం అందడం లేదు. విశాఖలో గంగవరం పోర్టు నిర్మాణం జరిగినప్పుడు అందులో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్న హామీ నెరవేరలేదు. పోలవరం నిర్వాసితుల సమస్యలు అలాగే ఉన్నాయి. మల్లన్న సాగర్ నిర్వాసితులకు న్యాయం చేయడంలో పెద్ద తతంగమే జరిగింది. ఇలాంటివన్నీ ప్రగతిని ఆపేవే. ప్రజలపై దమనకాండతో ముందుకు పోవాలన్న ధోరణిని పాలకులు విడనాడాలి. హైదరాబాద్ శివారులో ఔషధనగరి ఏర్పాటు చేస్తున్న సందర్భంలో నిర్వాసితులకు అర్హతలను బట్టి ఇక్కడే ఉద్యోగావకాశాలు ఇస్తామని మంత్రి కెటిఆర్ అన్నారు. అయితే హామీలు ఇచ్చినంతగా అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపించడం వల్లనే సమస్యలు వస్తున్నాయి. నీటి పారుదల ప్రాజెక్టులు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు, పరిశ్రమలు, పారిశ్రామిక కారిడార్లు, రైల్వేలైన్లు, రహదారు, ఇత్యాది అవసరాల కోసం సర్కారు లక్షల ఎకరాలను సేకరిస్తుండగా ఎన్నో లక్షల మంది నిర్వాసితులుగా మిగులుతున్నారు. ఒక సాగునీటి ప్రాజెక్టు కింద లక్షలాది ఎకరాలు సాగులోకి తేవడం కోసం ఎందరో తమ భూములను త్యాగం చేస్తున్నారు. కొన్ని లక్షల మంది గొంతు తడపడం కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్న సందర్భాల్లో ఉదారత అన్నది రావాలి. నిజానికి ఇలాంటి సమయంలో ప్యాకేజీలు భారీగా ఉంటే అభ్యంతరాలు రావు. భోగాపురం విమానా శ్రయానికి భూముల సేకరణ కూడా రగడగా మారింది. ప్రభుత్వం చేపడుతున్న అనేక రకాల ప్రాజెక్టుల్లో సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతున్న లక్షలాది మంది బతుకులు దుర్భరంగా ఉన్నాయి. నిర్వాసితులను ఆదుకోవాల్సిన సర్కారు నిర్లక్ష్యం వహించడం దారుణం కాక మరోటి కాదు. తరతరాలుగా ఉంటున్న ఊరిని, ఇంటిని, సాగుభూమిని కోల్పోయి బతుకులు ఛిద్రం అయిన వారిని అక్కున చేర్చుకొని ఆదరించడం సర్కార్ బాధ్యత కావాలి. రాజ్యాంగాన్ని, చట్టాలను, నిబంధనలను తోసి రాజని బలప్రయోగంతో ప్రాజెక్టుల కోసం నిర్వాసితులను వెళ్లగొట్టడం జరగకుండా చూడాలి. వారికి తగిన పరిహారం ఇచ్చి ఒప్పించి సాగనంపితే మంచిది. నడిరోడ్డున పడిన వారికి సహాయపడని ప్రభుత్వ విధానాల పై సమీక్ష జరగాలి. ఆర్టీసీ సమ్మె, ఇసుక కొరత తదితర సమస్యలు కూడా చిన్నవేమీ కావు. ఇవి చాలా పెద్ద సమస్యలే. వీటిని ఉక్కుపాదంతో అణచాలని చూడడం లేదా ఇపక్షాల కుట్ర కింద తీసుకోవడం వల్ల అభివృద్ధి ఆగిపోగలదు. అంతేగాకుండా ప్రజల నోటికాడి బుక్కను అడ్డుకోగలదు. ఇలాంటి సమస్యలపై ఉదారంగా ముందుకు రావాలి. ప్రజలను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి. అప్పుడే పాలకుల్లో ఉన్న మంచి ప్రజలకు కనిపిస్తుంది. ప్రజలు కూడా నిరంతరంగా అలాంటి పాలకుల వెన్నంటి నడుస్తారు.

# పీసీసీ పదవి కోసం పెరుగుతున్న పోటీ

### ఆ పదవికి అంతా అర్హులమే అంటున్న నేతలు

హైదరాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): గతంలో దశాబ్దకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడు చెప్పిన పని చేయలేదు. తాజాగా నాయకత్వ సమస్య అటు దేశంలోనూ,ఇటు రాష్ట్రంలోనూ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వరుస ఎన్నికల్లో ఓటమి కూడా కాంగ్రెస్‌ను కుంగదీస్తోంది. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఓటమితో కాంగ్రెస్ మరింతగా క్షీణించింది. పిసిసి పదవి కోసం ఎంతగా పోటీ ఉందంటే.. కాంగ్రెస్‌లో ఉన్న వారంతా ఆ పదవి కోసం ఎదురు చూస్తున్నారు. ఎవరికి వారు తామంతా అందుకు అర్హులమని అంటున్నారు. విహెచ్ అయితే తాను సమర్థుడినని అంటున్నారు. తాజాగా జగ్గారెడ్డి కూడా తన మనసులో మాట బయటపెట్టారు. ఇలా చెప్పుకుంటూ పోతే కులాలు,వర్గాలు,ప్రాంతాలుగా అంతా తామే సమర్థులమని చెప్పుకుంటారు. అధికారంలో ఉంటే సొంత ప్రయోజనాలు చూసుకోవడం, లేకుంటే ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదంటూ యాగీ చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య. తాజాగా కూడా క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ నేతలు ప్రజల సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీయలేక పోతున్నారు. దీనికి సరైన వ్యాయామం చేయకపోవడమే కారణంగా చూడాలి. ఇక పదేపదే తెలంగాణను సోనియాగాంధీ ఇచ్చారని చెప్పుకోవడం ద్వారా సానుభూతిని పొందే ప్రయత్నం చేస్తున్నారు. అలాంటి సానుభూతే ఉంటే టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ఉండేది కాదని గమనించడం లేదు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపునివ్వడం ద్వారా కార్యకర్తల్లో హుషారు కలిగించవచ్చు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అంటున్నారు. అధికారంలో ఉండగా జలయజ్ఞం దోపిడీ, మేఘమథనం దోపిడీ, ఇతర స్కామ్‌ల దోపిడీ గురించి మాట్లాడితే బాగుండేది. వారు కోరుకున్న నమూనాలో అభివృద్ధి ఉండాలనుకుంటారు. కమిషన్లు, వాటాలకు పెద్దపీట వేస్తారు. ఇవన్నీ బాగా చూసి ప్రభుత్వాన్ని వ్యాపారంగా నడిపిన వారికి దేశంలో, పలు రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు నడవడం ఇష్టం లేదు. అందుకే నానాయాగీ చేస్తుంటారు. ఇటీవలి కాంగ్రెస్ పార్టీ పదేళ్లపాటు దేశంలో, ఉమ్మడి ఆంధ్రాలో అధికారంలో ఉన్న కాలాన్నే తీసుకుంటే వీరు ఒరగబెట్టింది ఏమీ లేదు. కేవలం కుంభకోణాలను మూటగట్టింది. ఎన్నో స్కామ్‌లకు తెరలేపింది. ఇవన్నీ కళ్లకు కనిపిస్తున్న దృశ్యాలు. ఇక ఉమ్మడి ఎపిలో జలయజ్ఞం పేరుతో ప్రజాధనాన్ని వృధా చేశారు. మేఘమథనం పేరుతో నిధులు మింగారు. అందుకే వారు అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలపై విరుచుకు పడుతుంటారు. కాంగ్రెస్ నేతలు తమలో తాము కలహించుకోవడం, ఆ పార్టీలో కుమ్ములాటలను గుర్తించవచ్చు. వాటిని మరచి ఢిల్లీలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌లు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా సొంత ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని ఆరోపించడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు. అందుకే పిసిసి పదవి కోసం పోటీ పడుతున్నారు.

# భూ ఆక్రమణదారులను రైతుబంధు?

### ఆక్రమణదారులకు ఆర్థిక సాయం అందరాదు

హైదరాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): భూమి పట్టా ఉన్న వారికే ఎకరాకు 5వేల ఆర్థిక సాయం అందుతోంది. దర్జాగా ఎకరాకు పదివేల సాయం అప్పనంగా పొందుతున్నారు. ఇందులో అసలు రైతులను గుర్తించి ఇస్తున్నారా లేదా అన్న లెక్కలు తేలలేదు. అయితే భూ రికార్డుల సర్వేలో అక్రమాలు బయట పడుతున్నందున ఆయా భూములకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాల్సి ఉంది. వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్ భూములను కౌలు పేరుతో లేదా ఇతరత్రా పేర్లతో ఆక్రమించుకుని ఉంటే అలాంటి వారికి సాయం అందకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే అలాంటి భూములను స్వాధీనం చేసుకోవాలి. తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమం సక్రమంగా అమలు కావడంలో అధికారులదీ కీలక భూమిక కానుంది. వారు తప్పు చేస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వాలి. పొరపాట్లు చేసే అధికారులకు కఠిన దండనలు ఉండేలా చేయాలి. ఇప్పటికీ పట్టాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పక్కాగా వివరాలు సేకరించక పోవడం కారణంగా అనేకులు నష్ట పోతున్నారు. వీటిని సరిచేయాలి. ప్రధానంగా దేవాదాయ భూములు, అసైన్డ్ భూములు, సీలింగ్ భూముల విషయంలో ఖచ్చితమైన వివరాలు రావాలి. లేకుంటే సిఎం కెసిఆర్ ఎంతో దూరదృష్టితో తీసుకున్న ఓ విప్లవాత్మక ప్రయత్నం విఫలయత్నం కాగలదు. తెలంగాణలో కనీసం లక్ష ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. మాన్యాలు మింగేసిన వారు కొందరైతే వాటిని అమ్ముకుని సొమ్ము చేసుకున్న వారు మరికొందరు ఉన్నారు. అలాంటి వివరాలను ఈ సర్వేద్వారా నిగ్గు తేల్చాలి. వాటిని స్వాధీనం చేసుకోవడం ద్వారా ఆలయాలను పునరుద్దరి ంచాలి. రికార్డుల ప్రక్షాళనతో అన్ని వివాదాలకు చరమగీతం పాడాలన్న సంకల్పం అప్పుడే నెరవేర గలదు. రికార్డుల్లో రైతులకు అర్థం కాని పహణీ, సేత్వారి, పౌతిలాంటి పదాలు తొలిగించి, రైతులకు అర్థమయ్యే సరళమైన పదాలు పొందు పర్చాలని అధికారులను ఆదేశించడం మంచిదే. ఐదెకరాలకు పైబడిన భూములకు సంబంధించిన సాదా బైనామాలను కూడా కలెక్టర్ అనుమతితో క్రమబద్దీకరించాలని చెప్పారు. భూమి రికార్డుల ప్రక్షాళన, సరళీకరణ, నవీకరణలపై కెసిఆర్ చేసిన సూచనలకు అనుగుణంగా కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రజాప్రతి నిధులు కూడా తోడ్పాటు ఇవ్వాలి. అలాగే ఆక్రమయిత భూమలు వ్యవహారాలను కూడా నిగ్గు తేల్చాలి. భూమి రికార్డులను సమగ్రంగా ప్రక్షాళన చేసి, రైతులకు పక్కాగా పట్టాదార్ పాసుపుస్తకాలు అందించడం ద్వారా రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా నిరోధించాలి. అలాగే భూములు- వాటి యజమానుల వివరాలను పంచాయతీ గోడలపైన, ప్రభుత్వ పాఠశాలల గోడలపైన రాయాలి. గ్రామంలో భూ వివరాలకు సంబంధించిన పబ్లిక్ డాక్యుమెంట్‌ను అందుబాటులో ఉంచాలి. వివాదస్పద భూమలుకు సంబంధించి ఫిర్యాదులను పరిశీలించాలి. భవిష్యత్‌లో రైతులకు లేదా హక్కుదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రికార్డులను ఆధునీకరించాలి. ఏ ఒక్క గ్రామంలో కూడా ఇకముందు రికార్డులు సక్రమంగా లేవన్న ఫిర్యాదు రాకుండా చూడాలి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని రికార్డుల ప్రక్షాళన ద్వారా అన్ని వివాదాలకు చరమగీతం పాడాలి.

### కార్మికుల ఆత్మహత్యలు దారుణం: కటకం

కరీంనగర్,నవంబర్ 15(నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో మంచి పాలన రావాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమని, డిసిసి అధ్యక్షుడు కటకం మృత్యుంజయం అన్నారు. ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యలు దేశాన్నికదిలించినా కెసిఆర్‌ను కదిలించలేక పోయాయని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ రాచరిక పాలనను నిలదీసే ధైర్యం ఆ పార్టీ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉంటుందని, ఎవరు తప్పు చేసినా నిలదీసే హక్కుతో పాటు అవసరమైతే పదవి నుంచి తొలగించే అధికారం ఉంటుందని వెల్లడించారు. సోనియా, రాహుల్ అడుగుజాడల్లో పార్టీ నడుస్తుందని, ఎవరికి వారే హీరోలు అనుకుంటే కాంగ్రెస్‌లో నడవదని వివరించారు.

## వ్యక్తిగత మరుగుదొడ్లపై చైతన్యం

### స్వచ్ఛతలో వీటికి ప్రాధాన్యం

కామారెడ్డి,నవంబర్15(ఆర్ఎన్ఎ): పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ తరచూ ఆదేశిస్తూనే ఉన్నారు. ఇటీవలి గ్రామ ప్రణాళికలో భాగంగా స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇచ్చారు. రాష్ట్రంలో సిరిసిల్లరాజన్న జిల్లా నూరు శాతం మరుగుదొడ్ల నిర్మాణం చేసుకున్న జిల్లాగా ప్రత్యేక గుర్తింపు సాధించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటే గ్రామాల్లో ఆ ఊసే కనిపించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నూరుశాతం స్వచ్ఛతను సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. వ్యక్తిగత మరుగుదొడ్లు లేని కుటుంబాలన్నింటికీ మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు అవకాశమిచ్చాయి. జిల్లాను స్వచ్ఛ జిల్లాగా మార్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుకు కదిలితే శతశాతం సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. అధికారులు ప్రోత్సాహం అందించి, చైతన్యవంతం చేస్తే నిర్మాణాలు చేసుకునేందుకు లబ్దిదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంది. గిరిజన తండాలు అధికంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్మాణాలను ప్రోత్సహిస్తే శతశాతం సాధ్యమేనని అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ పెడితేనే ఆరుబయట కష్టాలకు చెక్ పడుతుంది. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ. 12వేలు అందిస్తున్నాయి. ఇందులో కేంద్రం వాటా రూ. 7200 కాగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 4800. మరుగుదొడ్డి లేని కుటుంబాలు స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రెండు విడతలుగా రూ. 12వేలు లబ్దిదారుల ఖాతాలో జమ అవుతాయి. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు 46 శాతం కుటుంబాలకే ఉన్నాయి. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇంకా అనేకవేల మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఇందులో పలువురు అప్పులు తెచ్చి నిర్మాణాలు చేపట్టారు. వీరంతా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేసుకున్న కుటుంబాలకు బిల్లుల చెల్లింపు త్వరితగతిన చేస్తేనే నిర్మాణాలు ముందుకు సాగుతాయని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.గ్రామాల్లో అధికారుల మధ్య సమన్వయం, అందుబాటులో ఉండకపోవడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. దీనిని నివారిస్తే నిర్మాణాలు ముందుకు సాగుతాయని గ్రామస్థులు పేర్కొన్నారు. నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని లబ్దిదారులు కోరుతున్నారు.

## గ్రేటర్ కరీంనగర్‌తో తీరనున్న కష్టాలు

### -మున్సిపల్ ఎన్నికలతో మారనున్న సీన్

కరీంనగర్,నవంబర్15(ఆర్ఎన్ఎ): తాజాగా గ్రేటర్ కరీంనగర్‌గా తీర్చిదిద్దడంతో ఇక ఎన్నికల తరవాత దీని రూపురేఖలు మారనున్నాయి. చుట్టుపక్కల గ్రామాలు కలపడంతో దీని విస్తీర్ణం కూడా పెరిగింది. కొత్త జిల్లాలో మున్సిపాలిటీల సంఖ్యను కూడా పెంచారు. ఇప్పటికే పెద్దపల్లి జిల్లా కావడంతో నగరపంచాయతీ నుంచి మున్సిపాలిటీ హోదాను కల్పించారు. ఆయా జిల్లాల పరిధిలో మరికొన్ని మండల కేంద్రాలను పట్టణాలుగా మార్చనున్నారు. దీంతో పాటే కరీంనగర్ జిల్లా కేంద్రానికి చుట్టు ఉన్న జిల్లాలకు కేంద్ర బిందువు కానుంది. నగరపాలక సంస్థ హోదా కల్పించినప్పుడే.. ఆ గ్రామాలను నగరంలోకి విలీనం చేయాల్సింది.. ఈ నేపథ్యంలో శివారు గ్రామాల విలీనం తప్పనిసరిగా మారిందనే సంకేతాలు కన్పిస్తున్నాయి. కరీంనగర్ మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థ హోదాను 2005 సంవత్సరంలో కల్పించారు. ఆ సమయంలో నగరానికి ఆనుకొని ఉన్న 10గ్రామాలను విలీనం చేయాలని ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది. దీంతో ఆయా గ్రామాల సర్పంచులు ఈ విలీన ప్రతిపాదనను అడ్డుకోవడం, న్యాయస్థానాన్ని ఆశ్రయించడం తో అప్పట్లో వాయిదా పడింది. ఆ తర్వాత గ్రామ పంచాయతీల పాలకవర్గ కాలపరిమితి ముగిసిన తర్వాత అప్పటి జిల్లా కలెక్టర్ ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపించడం..ప్రభుత్వం స్మార్ట్‌సిటీ హోదా కల్పిస్తుండటం.. నిధులకు ఏమాత్రం కొరత రాకుండా సౌకర్యాల కల్పనకు సిద్ధం అవుతుండటంతో నగరపాలక స్థాయి నుంచి గ్రేటర్ కరీంనగర్‌గా మారింది. ప్రస్తుతం 33జిల్లాల్లో హైదరాబాద్ మినహాయిస్తే వరంగల్ ఒక్కటే గ్రేటర్ కార్పొరేషన్ హోదా కలిగి ఉంది. గ్రేటర్ పరిధిలోకి రావడంతో తాగునీటి పైపులైన్లు విస్తరించాలని, ఆయా గ్రామాలకు తాగునీటి వసతి కల్పించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. నగరానికి ఆనుకొని ఉన్న 10గ్రామాలను నగరపాలక పరిధిలోకి విలీనం చేయడంతో ఇప్పుడు పరిధి విస్తరించడంతో పాటు విస్తరణకు ఆస్కారం ఏర్పడింది.

## అక్రమార్కుల పంటపండిస్తున్న ఇసుక

### గుట్టుచప్పుడు కాకుండా తరలింపు?

నిజామాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. దీన్ని నిరోధించాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోడంతో వాగులను పిండి మరీ తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు అలసత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు దొంగచాటుగా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దీంతో వారికి ఇదో ఆదాయవనరుగా మారింది. దాదాపు ఐదారు మీటర్ల లోతు వరకు ఇసుకను తీయడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో వాగులు, నదుల తీర ప్రాంత ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీటి కొరత తీవ్రంగా ఏర్పడనుంది. ఇసుక వ్యాపారం జోరుగా జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు శాఖాధికారులు ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవడంలో చూసీచూడనట్లు ఉంటున్నారు. ఇసుక దోపిడీ జరుగుతున్నా అధికారులు నామమాత్రంగా అపరాధ రుసుం విధించి చేతులు దులుపుకొంటున్నారు. దీంతో అర్ధరాత్రిళ్లు సైతం ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారు.

జిల్లాలోని వాగులు, నదులకు తీర ప్రాంతాలుగా ఉన్న కొన్ని గ్రామాల్లో ఇసుకను తరలించడానికి బహిరంగంగా అనధికార టెండర్లను సైతం నిర్వహిస్తున్నారు. వాహనాల రాకపోకలకు ప్రత్యేకంగా రహదారులను ఏర్పాటు చేసుకున్నారు. నీటి సంరక్షణ కోసం రూపొందించిన వాల్టా చట్టం అమలుకు తూట్లు పొడుస్తున్నారు. పెద్ద ఎత్తున తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో వాగులో ఉన్న ఇసుకను విక్రయించేందుకు అనధికార టెండర్లు నిర్వహిస్తున్నారు. దీన్ని దక్కించుకున్న గుత్తేదారులు పగలు, రాత్రి తేడా లేకుండా కొల్లగొడుతున్నారు. స్థానికంగా ఉన్న వాగులో నుంచే యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. దీని ద్వారా ప్రభుత్వ ఆదాయానికి ఎంత నష్టం వాటిల్లుతుందో అర్థం చేసుకోవచ్చు. పలు గ్రామాల నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వాగు, నదీ తీర ప్రాంతాల్లో ట్రాక్టరుకు రూ. 200 చొప్పున చెల్లించి తీసుకెళ్లడం ద్వారా కొన్ని గ్రామాల్లో అభ్యంతరం చెప్పడం లేదు. అక్రమార్కులు కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక అక్రమ వ్యాపారంపై అధికారులు దృష్టి సారించడం లేదని, స్థానికుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా స్పందించడం లేదని, అక్రమ రవాణాకు పరోక్షంగా సహకరిస్తున్నారని స్థానిక ప్రజల నుంతి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## ఆర్టీసీ కార్మికుల మృతికి కేసీఆరే కారణం

**- బంగారు తెలంగాణ ఆత్మహత్యల తెలంగాణగా మారింది**

**- బీజేపీ నేత బాబుమోహన్**

సంగారెడ్డి, నవంబర్15(నేటినిజం ప్రతినిధి) : ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా సీఎం కేసీఆర్ నియంతలా పాలన సాగిస్తున్నాడని, కార్మికుల మరణాలకు కేసీఆరే బాధ్యత వహించాలని బీజేపీ నేత, మాజీ మంత్రి బాబుమోహన్ అన్నారు. ఆర్టీసీ సమ్మె కారణంగా ప్రభుత్వ తీరుకు మనస్తాపం చెంది మృతి చెందిన నారాయణఖేడ్ డిపో కండక్టర్ నాగేశ్వర్ మృత దేహాన్ని సందర్శించి బాబుమోహన్ నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేసీఆర్ నియంతపాలన కొనసాగుతుందని విమర్శించారు. త్వరలో తెలంగాణ ప్రజలు, ఉద్యోగులు కేసీఆర్ నియంతృత్వ ధోరణికి చరమగీతం పాడుతారన్నారు. కేసీఆర్ కలలు గన్న బంగారు తెలంగాణ ఆత్మహత్యల తెలంగాణగా మారిపోయిందన్నారు. ఈ దమనకాండకు సీఎం కేసీఆరే బాధ్యులన్నారు. ఆర్టీసీ కార్మికుడు నాగేశ్వర్ కుటుంబానికి బీజేపీ అండగా నిలిచి ఆదుకుంటుందని బాబుమోహన్ హామీఇచ్చారు. భూమి పుట్టినప్పటి నుండి కేసీఆర్ లాంటి పాలకులు వచ్చి ఉండరన్నారు. ప్రజలు ఎన్నుకుంటేనే ప్రభుత్వంలో ఆ ప్రజలే ప్రాణ త్యాగాలకు గురైతే ఆదిని వారు కూడా లేపోవడం దురదృష్టకరమన్నారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, వారి ఉసురు తెలంగాణ ప్రభుత్వానికి తగలక మానదని ఆయన అన్నారు. అహంకార పూరితంగా వ్యవహరించకుండా కార్మికులను చర్చలకు పిలవాలని బాబుమోహన్ సూచించారు.

## భేషరతుగా వచ్చారు.. అభాసుపాలయ్యారు

**అయోమయంలో లేఖలిచ్చిన ఆర్టీసీ కార్మికులు**

హైదరాబాద్,నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ): ముఖ్యమంత్రి కెసిఆర్ మాటలపై నమ్మకంతో ఆయా డిపోల్లో మేనేజర్లకు విధుల్లో చేరుతున్నట్లు లేఖలిచ్చిన ఆర్టీసీ కార్మికులు కొందరు అభాసుపాలయ్యారు. ఇప్పటికీ వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా సంస్థ గుర్తించక పోవడంతో వారంతా అయోమయంలో పడ్డారు. ముఖ్యమంత్రిపై గౌరవంతో వచ్చిన తమను ఎటూకాకుండా పోయామని ఆవేదన చెందుతున్నారు. ఈనెల ఐదవతేదీ అర్ధరాత్రి లోపు విధుల్లో చేరినవారిని ఆర్టీసీ ఉద్యోగులుగా పరిగణిస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పెట్టిన గడువుకు 495 మంది విధుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతూ లేఖలు ఇచ్చారు. వారిలో 220 మంది మాత్రమే ఇప్పుడు విధులకు హాజరవుతున్నారు. మిగిలిన 275 మందిని సమ్మెలో ఉన్నట్లుగానే అధికారులు పరిగణిస్తున్నారు. వీరు సమ్మెలోకి వెళ్లకుండా విధుల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తుండగా...అధికారులనుంచి పిలుపు రాకపోవటంతో వీరి పరిస్థితి గందరగోళంగా మారింది. వీరు విధుల్లో చేరుతున్నట్టు సమర్పించిన లేఖలు తమకు అందలేదని డిపో మేనేజర్లు చెబుతున్నారు. ఇప్పటికే రెండు నెలల నుంచి వేతనాల్లేక ఇబ్బంది పడుతున్నందున, ఇప్పుడు డ్యూటీలో లేనట్లుగా అధికారులు పరిగణిస్తే ఇప్పటి వరకు పని వేతనం కూడా అందదేమోనని ఆందోళనతో ఉన్నారు. ఇదిలా ఉంటే, ఆర్టీసీలో తిరుగుతున్న అద్దె బస్సులకు గత రెండు మాసాలుగా నిధులు విడుదలకాకపోవడంతో అద్దె బస్సుల యజమానులు బస్సులు నిలిపివేస్తామని డిపో మేనేజర్లకు తెలిపారు. దీంతో వారు ఉన్నతాధికారులకు సమాచారం పంపారు. ఈవిషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిఉంది.

## విశ్వాసమా..? వివక్షా..?

**ఈరెండింటి మధ్యే వివాదం**

**విశ్వాసానికి చట్టబద్ధత కల్పించిన కేరళ హైకోర్టు**

**2018 నాటి తీర్పును తప్పుబట్టిన సుప్రీంకోర్టు**

**లింగ వివక్ష రాజ్యాంగ వ్యతిరేకమన్న న్యాయస్థానం**

**ఈ తీర్పుపై సమీక్షించాలని పలు పిటిషన్లు**

**అందుకే విస్తృత ధర్మాసనం ఏర్పాటు**

న్యూఢిల్లీ,నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ): శబరిమల ఆలయ వివాదం భక్తుల విశ్వాసం, లింగ వివక్ష మధ్య న్యాయసమీక్షకు తెరలేపింది. మత విశ్వాసాలతో ముడిపడిఉన్న ఈఅంశంపై దేశ అత్యున్నత న్యాయ స్థానం ఏం తేలుస్తుందని యావద్దేశం తీర్పు కోసం ఆసక్తిగా ఎదురుచూసింది. గత ఆదేశాలపై స్టే ఇచ్చేందుకు అంగీకరించని న్యాయస్థానం సమగ్రంగా విచారించేందుకు విస్తృత ధర్మాసనానికి సిఫార్సుచేయడం వెనక అసలు ఉద్దేశ్యం ఇదేనని భావిస్తున్నారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై కొనసాగుతున్న వివాదం ఈ నాటిది కాదు. మహిళల హక్కులకు, భక్తుల విశ్వాసాలకు, కోర్టు తీర్పులకు, ప్రభుత్వ నిర్ణయాలకు నడుమ ఈ వివాదం నలుగుతోంది. ఆలయంలోకి 10–50 ఏళ్ల మధ్య వయసు బాలికలు, మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తేస్తూ.. అన్ని వయసుల వారికి ప్రవేశాన్ని అనుమతిస్తూ గత ఏడాది సెప్టెంబరు 28న సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు– కొందరికి మోదాన్ని, మరికొందరికి ఖేదాన్ని మిగిల్చింది. దీనిపై హింసాత్మక నిరసనలు కొనసాగాయి. కేరళలో రాజకీయంగా ఎదగడానికి శ్రమిస్తున్న బీజెపి.. శబరిమల వివాదాన్ని ఓ అస్త్రంగా వాడుకుంటూ, దాన్ని నిలువరించేందుకు లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం ప్రయత్నించడంతో ఇదో రాజకీయ రణక్షేత్రంగానూ మారింది. ఆలయంలోకి ప్రవేశించడానికి పలువురు మహిళలు ప్రయత్నించినప్పటికీ.. ఈ ఏడాది జనవరిలో ఇద్దరు మాత్రమే లోపలికి వెళ్లగలిగారు. కోర్టు తీర్పు తర్వాత శబరిమలకు వెళ్లే మహిళలకు భద్రత కల్పించేందుకు కేరళలోని పినరయి విజయన్(ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం విమర్శల్ని ఎదుర్కొంది. తీర్పుపై పునస్సమీక్ష కోరుతూ దాఖలైన 64 పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. తాజాగా గురువారం ఉదయం తీర్పు వెలువరించింది. హరిహర పుత్రుడైన అయ్యప్ప స్వామి ఆజన్మ బ్రహ్మచారి అని.. అందువల్ల ఆయన ఆలయంలోకి రుతు క్రమం వయసులో ఉన్న మహిళల్ని అనుమతించకూడదనేది శతాబ్దాలుగా ఉన్న ఆచారం, విశ్వాసం. అలాంటి మహిళలు వస్తే ఆలయం అపవిత్రమవుతుందని.. శబరిమల ప్రధాన ఆలయం పక్కనే ఉన్న గుడిలోని మాలికాపురత్తమ్మను అగౌరవపరిచినట్లు అవుతుందని

కొందరు నమ్ముతారు. ఈ విశ్వాసానికి చట్టబద్ధత కల్పిస్తూ– ఆలయంలోకి 10–50 మధ్య వయసు మహిళలు ప్రవేశించకుండా 1991లో కేరళ హైకోర్టు నిషేధం విధించింది. దీనిపై వివాదం మొదలైంది. ఆలయంలోకి అన్ని వయసుల మహిళల్నీ అనుమతించాలన్న డిమాండ్ ఊపందుకుంది. కేరళలోని పతనంథిట్ట జిల్లాలో.. పశ్చిమ కనుమల్లోని శబరిమల శిఖరంపై ప్రసిద్ధ అయ్యప్ప స్వామి ఆలయం కొలువై ఉంది. సముద్ర మట్టానికి 3 వేల అడుగుల ఎత్తులో, పెరియార్ పులుల అభయారణ్యంలో 18 గుట్టల మధ్య ఆలయాన్ని నిర్మించారు. అయ్యప్ప అంటే వృద్ధి అని అర్థం. ఈ ఆలయానికి ఏటా కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ గుడిని నవంబరు–డిసెంబరులో మండల పూజలకు, జనవరి 14న మకర సంక్రాంతికి, ఏప్రిల్ 14న విషువ పండుగకు, మలయాళ నెలల్లోని ప్రతి మొదటి అయిదు రోజుల సమయంలో భక్తులకు పూజలు చేసుకోవడానికి తెరుస్తారు. కేరళ హైకోర్టు తీర్పును ఇండియన్ యంగ్ లాయర్స్ అసోషియేషన్ తరఫున ఆరుగురు మహిళలు 2006లో సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులకు అది విఘాతమని వాదించారు. దానిపై విచారించిన సుప్రీంకోర్టు– 2018, సెప్టెంబరు 28న తీర్పు ఇచ్చింది. స్త్రీ పురుషులని వివక్ష చూపడం రాజ్యాంగంలోని 25, 26 అధికరణలకు విరుద్ధమని పేర్కొంటూ నిషేధాన్ని ఎత్తేసింది. మహిళల ప్రవేశానికి అనుమతించింది. ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్రాతోపాటు జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్‌లు అనుకూలంగా తీర్పిచ్చారు. ఏకైక మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఇందూ మల్హోత్రా మాత్రం వ్యతిరేకించారు. సుప్రీంకోర్టు తీర్పుపై మొదట తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేసిన ఆలయ ప్రధాన అర్చకుడు కందారు రాజీవరు... తర్వాత మెత్తబడ్డారు. సనాతన సంప్రదాయాలను గౌరవించాలంటూ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో గట్టిగా వాదించిన, ఆలయ నిర్వహణ చూస్తున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సైతం ఆ తర్వాత తీర్పును గౌరవిస్తామంటూ ప్రకటించింది. అయితే.... వేలమంది అయ్యప్ప భక్తులు మాత్రం మహిళల ప్రవేశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదంటూ కేరళతో పాటు, దేశంలోని ఇతర ప్రాంతాల్లో నిరసనలకు దిగారు.

# గిట్టుబాటు ధరలకు ధాన్యం కొనుగోళ్లు

**దేశంలో ఎక్కడా లేని విధంగా ఏర్పాట్లు**

**పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి**

హైదరాబాద్,నవంబర్ 15(ఆర్‌ఎన్‌ఎ): రైతులు ఆరుగాలాలు శ్రమించి పండించిన ప్రతి ధాన్యం గింజను కనీస మద్దతు ధరకు కొనుగోలుచేస్తున్నట్లు పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రానికి ఆర్థికభారం అయినా రైతుల రాజుగా చూడాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ దూర దృష్టితో ఈ చర్యలు తీసుకున్నారని అన్నారు. రాష్ట్రంలో భారతదేశంలో ఒక్క తెలంగాణ మాత్రమే ఇలా ధాన్యం కొనుగోళ్లను పక్కాగా చేపట్టిందన్నారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల కరెంట్, రైతు బంధు పథకంతో రాష్ట్రంలో సాగువిస్తీర్ణం పెరిగి ఈ ఖరీఫ్‌లో రికార్డుస్థాయిలో ధాన్యం దిగుబడి రానుందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు, చెల్లింపులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, రాష్ట్రానికి ఆర్థికభారం అయినా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని దీనిని అమలు చేస్తున్నారని అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని అన్నారు. రైతుల నుంచి ధాన్యంకొనుగోళ్లు, కనీసమద్దతుధర చెల్లింపుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా చూడాలని కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులకు శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు.

పక్క రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు ధాన్యం కొనుగోళ్లలో సీలింగ్‌విధించడం, గిట్టుబాటు ధర ఇవ్వక పోవడంతో దళారులు, వ్యాపారస్తులు రైతుల పేరుతో తెలంగాణలో ధాన్యం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సరిహద్దుల్లో గట్టి నిఘాతో దీన్ని అరికట్టాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా చూడాలని, ఈవిషయంలో కలెక్టర్లు, జాయింట్‌కలెక్టర్లు, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. తెలంగాణ రైతులకు నష్టం కలిగించే ఏ చర్యను కూడా ఉపేక్షించబోమని ఆయన స్పష్టంచేశారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోళ్ల కోసం 3406 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామని తెలిపారు. ఇప్పటి వరకు 1447 కేంద్రాలను ప్రారంభించి 36,862 మంది రైతుల నుంచి 2.51 లక్షల మెట్రిక్‌టన్నులధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఇందులో 2.39 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించామన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, చెల్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్ ప్రొక్యూర్ మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఓపీఎంఎస్)లో నమోదు చేస్తున్నామని అన్నారు. మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని అన్నారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా ప్రొక్యూర్ మెంట్ కమిటీలతో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సమావేశాలు నిర్వహిస్తూ ధాన్యం , లోడింగ్ ఆన్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన మిల్లర్ల అక్నాలెడ్జ్‌మెంట్ వంటి అంశాలపై అధికారులు నిత్యం సమీక్షించాలని అన్నారు. పక్క రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు ధాన్యం కొనుగోళ్లలో సీలింగ్‌విధించడం, గిట్టుబాటు ధర ఇవ్వక పోవడంతో దళారులు, వ్యాపారస్తులు రైతుల పేరుతో తెలంగాణలో ధాన్యం విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. సరిహద్దుల్లో గట్టి నిఘాతో దీన్ని అరికట్టాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా చూడాలని , ఈవిషయంలో కలెక్టర్లు, జాయింట్‌కలెక్టర్లు, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. తెలంగాణ రైతులకు నష్టం కలిగించే ఏ చర్యను కూడా ఉపేక్షించబోమని ఆయన స్పష్టంచేశారు. ధాన్యం విక్రయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీలతో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సమావేశాలు నిర్వహిస్తూ ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మిల్లర్ల అక్నాలెడ్జ్‌మెంట్ వంటి అంశాలపై అధికారులు నిత్యం సమీక్షించాలని అన్నారు.

# రఫేల్‌పై అసత్య ప్రచారాలు చేశారు

**సుప్రీం తీర్పు వారికి దిమ్మతిరిగే సమాధానం: షా**

న్యూఢిల్లీ,నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ): రఫేల్ వ్యవహారంలో దాఖలైన రివ్యూ పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేయడంపై భాజపా జాతీయ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. రఫేల్‌పై అసత్య ప్రచారాలు చేసిన పార్టీలు, నేతలకు ఇది దిమ్మతిరిగే సమాధానమని అన్నారు.

పారదర్శకతకు, అవినీతి రహిత పాలనకు మోదీ సర్కారు పెద్దపీట వేస్తుందనేది సుప్రీం తీర్పుతో మరోసారి రుజువైందన్నారు. రఫేల్ అంశంపై పార్లమెంట్ సమయాన్ని వృథా చేశారని, ఇకపై ప్రజా ప్రయోజనాల కోసం ఉ పయోగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. జాతి ప్రయోజనాలను పక్కనపెట్టి రఫేల్ వ్యవహారంలో ఆరోపణలు చేసిన కాంగ్రెస్ పార్టీ, ఆపార్టీ నేతలు దేశానికి క్షమాపణలు చెప్పాలని అమిత్ షా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ట్వీట్‌చేశారు. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంలో కేంద్రానికి ఊరట లభించింది. రఫేల్‌పై దాఖలైన సమీక్ష పిటిషన్లనన్నింటినీ సుప్రీం కోర్టు తిరస్కరించింది.

రఫేల్‌పై గతంలో ఇచ్చిన తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. 36 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం 2018 డిసెంబర్ 14న సంబంధిత పిటిషన్లను కొట్టివేస్తూ కేంద్రానికి క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ తీర్పును పునఃపరిశీలించాలని కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్‌శౌరీలతోపాటు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌లు వ్యాజ్యాలు దాఖలు చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగొయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తాజాగా వీటిపై తీర్పు వెల్లడించింది.

# ఏకగ్రీవాలకు అందరని నజరానాలు

**చిన్నపంచాయితీలకు పెద్ద కష్టాలు**

వరంగల్,నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ): ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం అందించాల్సిన రూ. 10 లక్షల నగదు ప్రోత్సాహం అందలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆయా ఏకగ్రీవ పంచాయితీ సర్పంచ్‌లు వీటి కోసం చకోర పక్షుల్లా ఎదురు చూస్తున్నారు. ఎన్నికలకు వెళ్లకుండా పాలకవర్గాన్ని ఏకగ్రీవం చేసుకున్న పంచాయతీలు ప్రభుత్వం నజరానా ప్రకటించింది. అయితే ప్రభుత్వం నజరానా ఇవ్వక పోడంతో అభివద్ధి పనులు చేయలేక సర్పంచులు ఇబ్బందులు పడుతున్నారు. తండాలు పంచాయితీలుగా ఏర్పడ్డా వాటికి నేటికీ సొంత భవనాలు లేవు. పంచాయతీ కార్యాలయాలను అద్దె భవనాలు, మూత పడిన పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. పాలక వర్గం ప్రత్యేక సమావేశాలు, గ్రామ సభలను బహిరంగ ప్రదేశాల్లోనే చెట్ల కిందనే నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో అభివృద్ధి పడకేసి, అడుగు ముందుకు సాగడం లేదు. పారిశుధ్యం లోపిం చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, అభివృద్ధి నిధులు లేక పోవడంతో సర్పంచ్‌లు చేతులెత్తేస్తున్నారు. సమస్యలను పరిష్కరించడానికి అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామాలు చిన్నవి కావడంతో పన్నులు వసూలు కావడం లేదు. ఏ సమస్య వచ్చినా సర్పంచులు సతమతమైపోతున్నారు. 30 రోజుల ప్రణాళిక కోసం కూడా నిధులు లేక సర్పంచ్‌లు అప్పులు చేసి లక్షలు ఖర్చు చేసి పనులను చేపట్టిన దాఖలాలు ఉన్నాయి. దానికి కూడా ప్రభుత్వం ఇప్పటి వరకు నయా పైసా నిధులు ఇవ్వకపోవడం గమనార్హం. చిన్న గ్రామాలు కావడంతో నిధులు ఉండవని ఏకగ్రీవంగా స్పంచ్‌ను ప్రజలు ఎన్నుకున్నారు. పభుత్వం ప్రకటించిన రూ. 10 లక్షల నగదు ప్రోత్సాహంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుంటాం. ప్రభుత్వ త్వరగా నిధులు విడుదదల చేసి గ్రామాభివృద్ధికి తొడ్పాడాలని కోరుతున్నారు.

## బిజెపి నేతల పగటి కలలు

**అస్థిర రాజకీయాలకు బిజెపి యత్నాలు**

**తెలంగాణలో భ్రమల్లో ఉన్నారన్న కర్నె**

హైదరాబాద్,నవంబర్ 15 (ఆర్‌ఎన్‌ఎ): రాష్ట్ర బీజేపీ నేతలు చిల్లరగా మాట్లాడుతున్నారని శాసనమండలి విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. బిజెపిని నమ్మి కెసిఆర్‌ను కాదని ఆ పార్టీలోకి వెళ్లేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరని గుర్తుంచుకోవాలని అన్నారు. గురువారం నాడిక్కడ కర్నె మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో అమలవుతున్న పథకాలను దేశవ్యాప్తంగా ఎలా అమలు చేయాలన్న దానిపై బీజేపీ కేంద్ర మంత్రులే తమతో టచ్‌లో ఉంటూ మాట్లాడుతున్నరన్నారు. అటువంటిది రాష్ట్ర బీజేపీ నేతలు దుర్మార్గంగా మాట్లాడుతున్నరని అన్నారు. నాలుగు ఎంపి సీట్లు గెలవగానే బీజేపీ ఎగిరెగిరి పడుతోంది. రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధికి ఓటేస్తున్నరు. మొన్న జరిగిన హుజూర్‌నగర్ నియోజకవర్గ ఉపఎన్నికలో బీజేపీ నాలుగో స్థానంలో నిలిచింది. ఆ పార్టీ నేతలు అనైతిక చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తమిళనాడులో బలం లేకపోయినా అధికారం కోసం కుట్రలు చేశారు. కర్నాటకలో బలం ఉన్న ప్రభుత్వాన్ని కుట్రలు చేసి దింపారు. గోవా, మహారాష్ట్రల్లోనూ బీజేపీ కుట్రలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇవన్నీ దేశం గమనిస్తోందని గుర్తుంచుకోవాలన్నారు. ఇవన్నీ మరచి టిఆర్‌ఎస్ నేతలు టచ్‌లో ఉన్నారని చేస్తున్న ప్రకటనలు వారి అపోహ మాత్రమేనని అన్నారు.

# అయోధ్యలో రామాలయ నిర్మాణం దేశానికి గర్వకారణం

**రూ.51 వేల విరాళం ప్రకటించిన వక్ఫ్ బోర్డు చైర్మన్ వసీం రిజ్వీ**

లక్నో,నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ): అయోధ్యలో రామ మందిర నిర్మాణం దేశానికి గర్వకారణమని ఉత్తర ప్రదేశ్ షియా సెంట్రల్ వక్ఫ్ బోర్డు చైర్మన్ వసీం రిజ్వీ అన్నారు. దీనిని తాము స్వాగతిస్తున్నామని అన్నారు. ఆలయ నిర్మాణం కోసం తనవంతుగా రూ.51 వేల విరాళం ప్రకటించారు. అయోధ్యలో రామమందిర నిర్మాణానికి తమ బోర్డు అనుకూలమని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల నాటి ఈ వివాదంపై సుప్రీంకోర్టు ఇటీవల అత్యుత్తమ తీర్పు వెల్లడించిందని పేర్కొన్నారు. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో రామ మందిర నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు మసీదు నిర్మాణం కోసం సున్నీ వక్ఫ్ బోర్డుకు అయోధ్యలో ఐదు ఎకరాలు కేటాయించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశించింది. నేపథ్యంలో రిజ్వీ స్పందిస్తూ... 'అయోధ్యలో రామమందిర నిర్మాణం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీ రాముడితో మాకు కూడా అనుబంధం ఉన్నందున 'వసీం రిజ్వావీ ఫిల్మ్' తరఫున రామ జన్మభూమి న్యాస్‌కు రూ. 51 వేలు విరాళంగా ఇస్తున్నాం..' అని రిజ్వీ పేర్కొన్నారు. కాగా అయోధ్యలో రామ మందిర నిర్మాణం భారత్‌లోని 'రామభక్తులకు' గర్వకారణమని ఆయన వ్యాఖ్యానించారు.

# అక్కినేని జాతీయ అవార్డుల ప్రకటన

**నటి రేఖ, శ్రీదేవిలకు వరుసగా అవార్డులు**

**17న కార్యక్రమం నిర్వహణ: వెల్లడించిన నాగార్జున**

హైదరాబాద్,నవంబర్ 15(ఆర్‌ఎన్‌ఎ): స్వర్గీయ అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డుల ప్రధానోత్సవం ఈ నెల 17న నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. ఏటా ఈ కార్యక్రమాన్ని ఘనంగా జరుగుతుందన్న సంగతి తెలిసిందే. కొన్ని కారణాల వల్ల గతేడాది ఆ కార్యక్రమాన్ని నిర్వహించలేకపోయాని కళాబంధు టి సుబ్బిరామిరెడ్డి, నాగార్జున తెలిపారు. అయితే 2108, 2019 సంవత్సరానికి గానూ ఏఎన్నార్ జాతీయ అవార్డులను ప్రకటించారు. నటి రేఖ, దివంగత శ్రీదేవిలకు ఈ అవార్డులను ఇవ్వనున్నట్లు

మీడియా సమావేశంలో సుబ్బరామి రెడ్డి, నాగార్జునలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇరువురు మాట్లాడుతూ..ఇది మాకు అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం అని నాగార్జున అన్నారు. ఈ కార్యక్రమం ఇంత పెద్ద విజయం సాధించడానికి టీఎస్సార్ ఒక కారణం.. ఆయన మా నాన్నకు క్లోజ్ ఫ్రెండ్.. నాక్కూడా క్లోజ్ ఫ్రెండ్.. మా నాన్న చనిపోయాక.. మా ఫ్యామిలీకి పెద్ద దిక్కుగా ఉన్నారు.. నాకు ఏ చిన్న ప్రాబ్లమ్ వచ్చినా.. ఆయన ఏ సమయంలోనైనా రెస్పాండ్ అవుతారు. సుబ్బిరామి రెడ్డిగారికి థ్యాంక్స్.. చిరు చేతుల మీదుగా దీనిని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భాగంగానే.. అన్నపూర్ణ ఫిల్మ్ స్కూల్ విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్నాము. చివరగా అమితాబ్, రాజమౌళి కొంతమంది విద్యార్థులకు అందజేశాము. ఈ సారి రేఖ చేతుల మీదుగా ప్రధానం చేస్తాము. రేఖ గారికి ఫోన్ చేసిన వెంటనే వస్తానని చెప్పారు. చిరంజీవి చేతుల మీదుగా 2018 - శ్రీదేవీ, 2109 -రేఖకు అవార్డును ప్రధానం చేయనున్నాము. అవార్డులో భాగంగా ఐదు లక్షలు ఇస్తామని, మొదటి నుంచి అదే పాటిస్తున్నాము.. ఇక్కడ డబ్బు ప్రధానం కాదు.. అవార్డు ముఖ్యమ'ని అన్నారు. ఈ కార్యక్రమానికి ఏ సీఎంలను పిలవడం లేదని చెప్పారు. టీఎస్సార్ మాట్లాడుతూ.. 'ఏఎన్నార్ గారికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చినప్పుడు.. తన పేరు మీద కూడా ఓ అవార్డును ప్రకటించాలని, గొప్ప వారికి వాటిని బహూకరించాలని అన్నారు.. ఆ కమిటీ నన్ను చైర్మన్‌గా ఉండమని కోరారు.. అలా మొదటగా లతా మంగేష్కర్ గారికి ఇచ్చాము.. ఆ తరువాత దేవానంద్, వైజయంతీ మాల, హేమా మాలిని, శ్యామ్ బెనెగళ్, కె బాలచందర్, అమితాబ్, రాజమౌళి.. ఇలా సినీ పరిశ్రమకు ఎనలేని కృషి చేస్తున్నవారికి అందిస్తూ వస్తున్నాము. దాన్ని ఆయన కుమారుడు నాగార్జున ఎంతో బాధ్యతతో ముందుకు తీసుకెళ్తున్నారు. శ్రీదేవీ, రేఖలకు ఏఎన్నార్ జాతీయ అవార్డు ఈ సందర్భంలో నాగార్జునను మెచ్చు కోవాలి.. తండ్రి కోరికను, ఆలోచనలను ముందుకు తీసుకెళ్తూ ఎంతో మంచి పనులు చేస్తున్నారు. ఈ కాలంలో తల్లిదండ్రులంటే ప్రేమ ఉంటుంది.. తరువాత మరిచిపో తారు.. కానీ వారి కోరికలు గుర్తుండవు కానీ నాగార్జున్ మాత్రం అలా కాదు.. వారి తండ్రి కోరికను ఇలా నెరవేరుస్తూ వస్తున్నారు. ఏఎన్నార్ లాంటి మహనీయ వ్యక్తి మరొకరుండరు.. ఆయన నా కలలోకి వస్తుంటారు. ఈ కార్యక్రమం నవంబర్ 17 నాడు అంగరంగ వైభవంగా జరగబో తోంది. శ్రీదేవీ, రేఖలకు ఈ అవార్డును ప్రధానం చేయనున్నాము. బోనీకపూర్, జాన్వీ, ఖుషీ కపూర్‌లు అవార్డు తీసుకుంటారని అన్నారు.

## భూమి అక్రమ మ్యుటేషన్.. ఇద్దరు రైతుల ఆత్మహత్యాయత్నం

సంగారెడ్డి,నవంబర్ 15(నేటినిజం ప్రతినిధి): కల్హేర్ తాహసీల్దార్ కార్యాలయం ఎదుట అన్నదమ్ములైన ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నం చేశారు. మహదేవ్‌పల్లికి చెందిన శివమ్మపేరుతో ఉన్న ఎకరా 20 కుంటల భూమిని వీఆర్‌ఓ లాలయ్య ఇతరుల పేరిట పట్టాచేశారని ఆమె కుమారులు ఆరోపించారు. భూమిని తిరిగి తన తల్లి పేరుమీద చేయాలని ఎన్నిసార్లు తిరుగుతున్నా రెవెన్యు సిబ్బంది పట్టించుకోవడం లేదని అన్నదమ్ములు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం దగ్గర వీఆర్‌ఓను నిలదీశారు. అనంతరం తమతో తెచ్చుకున్న పెట్రోల్ ఒంటిపై పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని హల్ చల్ చేశారు. దీంతో సిబ్బంది రైతులిద్దరిని సముదాయించడంతో వారు శాంతించారు. విచారణ జరిపి భూమిని శివమ్మపేరిట చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు లింగయ్య, సాయిలు శాంతించారు.

## దేశానికి రాహుల్ క్షమాపణ చెప్పాలి

**– బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా**

న్యూఢిల్లీ, నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ) : రాఫెల్ యుద్ధ విమానాల కొలుగోలు ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ పార్టీ తన శక్తియుక్తులన్నీ ఉపయోగించిందని బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా విమర్శించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంపై క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని సమీక్షించాలంటూ దాఖలైన రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీనిపై కోర్టు పర్యవేక్షణలో విచారణ అవసరంలేదని కూడా సర్వోన్నత ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా జేపీ నడ్డా మాట్లాడుతూ.. రఫేల్ ఒప్పందంపై అసత్య ఆరోపణలు గుప్పించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాఫెల్ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు రాహుల్, ఆయన పార్టీ గల్లీ నుంచి ఢిల్లీ దాకా తీవ్ర ప్రయత్నాలు చేశారని, కానీ ఇప్పుడు నిజం బయటపడిందని అన్నారు. రాహుల్ గాంధీ ఇప్పటికైనా దేశానికి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ పార్టీపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఇదే తరహాలో స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అప్రదిష్టపాలు చేసేందుకే రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ లేనిపోని ఆరోపణలు చేసిందని ఆయన దుయ్యబట్టారు. రాఫెల్ ఒప్పందంపై కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టించిందనీ... ఆ పార్టీని ప్రజలు క్షమించబోరని ఆయన పేర్కొన్నారు. దేశ ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాల్సిందేనని రక్షణ మంత్రి డిమాండ్ చేశారు.

## శబరిమలకు 36మంది మహిళల నమోదు

తిరువనంతపురం, నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ) : శబరిమల ఆలయ దర్శనానికి మహిళలకు అనుమతినిస్తూ గతంలో ఇచ్చిన తీర్పుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆలయ కమిటీ స్వామి దర్శనానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రారంభించింది. ఇప్పటి వరకు స్వామి వారిని దర్శించుకోవడం కోసం 36మంది మహిళలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడడానికి కొద్ది సమయం ముందే ఈ రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది సెప్టెంబర్ 28న ఆలయం లోపలికి మహిళల ప్రవేశ నిషేధాన్ని ఎత్తివేస్తూ తీర్పు వెలువడిన విషయం తెలిసిందే. గతంలో 10 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సున్న మహిళలు ఆలయంలోకి ప్రవేశించడం నిషేధం. కోర్టు తీర్పునిచ్చిన తరువాత ఈ ఏడాది జనవరి 2న ఇద్దరు మహిళలు ఆలయ ప్రవేశం చేశారు. గతేడాది కూడా నిషేధిత వయస్సు కల 740మంది మహిళలు ఆలయ ప్రవేశం కల్పించలంటూ ఆన్‌లైన్ నమోదు చేసుకున్నారు. నమోదు చేసుకున్న వారి వివరాలను పోలీసులు సేకరించిన తరువాత వారి ఇళ్లకు వెళ్లి వారు తీర్థయాత్రకు రావడం లేదని స్పష్టం చేసుకున్నారు. ఇప్పుడు నమోదు చేసుకున్న 36మంది మహిళల వివరాలను పోలీసులు సేకరించారని సమాచారం. తాజాగా వెలువడిన సుప్రీం తీర్పు గురించి ప్రస్తావించడానికి ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ నిరాకరించారు. దేవాదాయ రాష్ట్ర మంత్రి కడకంపల్లి సురేంద్రన్ మీడియాతో మాట్లాడుతూ సుప్రీం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం పాటిస్తుందన్నారు.

## నల్లమలలో యురేనియం అనుమతులు రద్దు

**–ఏఎండీకి స్పష్టంచేసిన అటవీశాఖ**

హైదరాబాద్,నవంబర్ 15,(ఆర్‌ఎన్‌ఎ): నల్లమల అటవీ ప్రాంతంలో యురేనియం నిక్షేపాల అన్వేషణ, తవ్వకాలకు సంబంధించి అటామిక్ మినరల్ డైరెక్టరేట్ (ఏఎండీ)కు రాష్ట్ర వన్యప్రాణి సంరక్షణ బోర్డు ఇచ్చిన అనుమతులు రద్దయ్యాయి. యురేనియం నిల్వలున్నాయో లేదో తెలుసుకునేందుకు డ్రిల్లింగ్‌తోపాటు వెలికితీతకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని రాష్ట్ర అటవీ శాఖ స్పష్టం చేసింది. గత ఏఎండీ ప్రతిపాదనలకు పూర్తి భిన్నంగా ప్రస్తుత ప్రాజెక్టు స్వరూపం మారడంతో నల్లమలలో 4 వేల బోర్లు వేసి యురేనియం అన్వేషిస్తామంటూ ఏఎండీ పంపించిన కొత్త ప్రతిపాదనలు తమకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని అటవీ శాఖ స్పష్టీకరించింది. యురేనియం అన్వేషణకు 2016 డిసెంబర్‌లో తెలంగాణ స్టేట్ వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశం ఇచ్చిన అనుమతులు, ఒప్పందాలు రద్దయినట్టుగా ఏఎండీ, కేంద్ర అటవీశాఖ, కేంద్ర వన్యప్రాణి బోర్డుకు తాజాగా లేఖల ద్వారా స్పష్టం చేసింది. నల్లమలలో ఆమ్రాబాద్ పులుల అభయారణ్యంలో యురేనియం అన్వేషణలో అడవికి నష్టం కలి గించేలా ఎలాంటి తవ్వకాలు చేపట్టరాదనే అటవీ నిబంధనల్లో పొందుపరచడం రాష్ట్ర అటవీ అధికారులకు కలిసొచ్చింది. అందుకు విరుద్ధంగా ఏఎండీ ప్రతిపాదిత చర్యలున్నందున గతంలో ఆమోదించిన ప్రతిపాదనలకు ఎలాంటి విలువలేకుండా పోయిందని అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 2016లో జరిగిన వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశంలో పర్యావరణవేత్తలుగా ఉన్న పలువురు సభ్యులు టైగర్ రిజర్వ్‌లో అన్వేషణకు ఎలాంటి తవ్వకాలు జరపరాదని, అందుబాటులో ఉన్న మార్గాలు, ఇతర నియమ, నిబం ధనలను మినిట్స్‌లో నమోదు చేశారు. ఈ నేపథ్యంలో 2016 సమావేశంలోని నమోదు చేసిన మినిట్స్‌కు వ్యతిరేకంగా తాజా ప్రతిపాదనలున్నందున గతంలో ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తున్నట్టు అటవీశాఖ ప్రకటించింది. శాస్త్ర, సాంకేతికపరమైన అవసరాల కోసం యురేనియం అన్వేషణ అవసరం పడితే అది ఎలా చేస్తారు, దానికి అనుసరించే పద్ధతులు, సాంకేతికతకు సంబంధించి ఏఎండీ కొత్త ప్రతిపాదనలను స్టేట్ వైల్డ్‌లైఫ్ బోర్డుకు పంపిస్తే వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఉన్నతాధికారులు స్పష్టంచేశారు. రాష్ట్రంలో యురేనియం నిక్షేపాలను ఎట్టి పరిస్థితుల్లో బయటకు తీసేం దుకు అనుమతివ్వబోమని కౌన్సిల్‌లో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. యురేనియం నిక్షేపాల పరిశోధన, తవ్వకాలకు అనుమతులు ఇచ్చేది లేదంటూ ఉభయసభల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం ఆమోదించడంతో అటవీ అధికారులు తాజాగా శాఖాపరంగా తమ వైఖరి స్పష్టంచేశారు. ఈ మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అటవీ శాఖ పూర్తిస్థాయిలో కట్టుబడిఉందని, డ్రిల్లింగ్ చేయకుండా యురేనియం నిక్షేపాల అన్వేషణ చేపడతామంటూ ఏఎండీ సమర్పించిన ప్రతిపాదనలకు అనుగుణంగా ఇచ్చిన అనుమతులు కూడా రద్దయినట్టుగా లేఖ ద్వారా వెల్లడించింది.

## తెలంగాణ నుంచి యూఎస్‌కు ఫార్మా ఉత్పత్తులు

**నేరుగా డల్లాస్‌కు విమాన సర్వీసులు కావాలి**

**వినోద్‌కుమార్‌కు ఎన్నారైల వినతి**

హైదరాబాద్,నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ): దక్షిణ అమెరికా ప్రాంతాలకు తెలంగాణ నుంచి ఫార్మా ఉత్పత్తులు సరఫరా చేయాలని ఈ మేరకు చర్యలు తీసుకోవాలని అమెరికా చాంబర్‌ఆఫ్ కామర్స్ డల్లాస్ పోర్ట్ వర్త్‌శాఖ ప్రతినిధులు రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న వినోద్ కుమార్ హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతూ బుధవారం డల్లస్ చేరుకున్నారు. ఈసందర్భంగా అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ డల్లాస్ ఫోర్ట్ వర్త్ అధ్యక్షులు నీల్ గోనుగుంట్ల నేతృత్వంలోని ప్రతినిధి బృందం వినోద్‌కుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై ఇష్టాగోష్టిగా చర్చించారు. దక్షిణ అమెరికాలో పెద్ద సంఖ్యలో ఎన్నారైలు స్థిర పడ్డారని భారత సంతతికి చెందిన వారు మాతృదేశం ముఖ్యంగా తెలంగాణలోని హైదరాబాద్ ఫార్మా ఉత్పత్తులను ఇష్టపడాతారని అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు వినోద్‌కుమార్‌కు వివరించారు. ఈనేపథ్యంలో ఎయిర్ ఇండియా కార్గొ విమానసర్వీసుల ద్వారా తెలంగాణ ఫార్మా ఉత్పత్తులను డల్లాస్ ఫోర్ట్‌వర్త్‌తో పాటు దక్షిణ అమెరికాకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని వినోద్‌కుమార్‌ను కోరారు. డల్లాస్ ఫోర్ట్‌వర్త్ దక్షిణి అమెరికాలో తెలుగు రాష్ట్రాల ప్రజలు పెద్ద ఎత్తున నివాసం ఉంటున్నందున హైదరాబాద్ నుంచి డల్లాస్‌కు నేరుగా ఎయిర్ ఇండియా విమాన సర్వీసులు ప్రారంభించడానికి కృషి చేయాలని వారు కోరారు. మూడుసార్లు పార్లమెంట్‌సభ్యుడిగా పనిచేసిన అనుభవం ఉండడం, కేంద్రంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి తమ విజ్ఞప్తిని సాకారం చేయాలని వారు వినోద్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో పార్లమెంట్‌లో చేయనున్న నూతన విద్యాపాలసీ 2019 చట్టంతో ఇప్పటి వరకూ విదేశీ యూనివర్శిటీలకు దేశంలో ఉన్న నిషేధం తొలగిపోనుందని ఇది తెలంగాణకు మహర్దశ కలిగించ నునందన్నారు. అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. తెలంగాణలో అమెరికాయూనివ్శిటీల ఏర్పాటుకు పూర్తి సహకారాన్ని అందిస్తామని వారు వినోద్‌కుమార్‌కుహామీ ఇచ్చారు. ఈ ఇష్టాగోష్టిలో ఎన్నారై తెలంగాణ ప్రతినిధులు డాక్టర్ దేవయ్య, దయాకర్‌పుష్కార్, తదితరులు పాల్గొన్నారు.

## థర్మల్ విద్యుత్ కేంద్రంలో ప్రమాదం

లక్నో,నవంబర్15(ఆర్‌ఎన్‌ఎ): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఓ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం టర్బైన్ జనరేటర్ యూనిట్ లో చోటు చేసుకున్న పేలుడు ఘటన కారణంగా అక్కడ పనిచేస్తున్న నలుగురు ఇంజనీర్లు తీవ్రంగా గాయపడ్డారు. సోనే భద్ర జిల్లాలో ఉన్న ఈ విద్యుత్ కేంద్రంలో బుధవారం రాత్రి విధుల్లో ఉండగా ఈ ఘటన చోటు చేసుకోగా గాయపడిన ఇంజనీర్లను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. కాగా ప్రమాదం జరిగిన వెంటనే ఆ ధికారుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక యంత్రాలు మంటల్ని అదుపు చేస్తున్నారు. యూపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎ÷–లాంట్ లో ప్రమాదం కారణంగా విద్యుత్ ఉత్పత్తికి ఆరు నెలలపాటు అంతరాయం కలగనుందని అధికారవర్గాల సమాచారం.

## కశ్మీర్ అసెంబ్లీకి త్వరలోనే ఎన్నికలు- లెఫ్టినెంట్ గవర్నర్ గిరీశ్ చందర్ ముర్మ

శ్రీనగర్, నవంబర్14(ఆర్‌ఎన్‌ఎ) : కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దు అనంతరం.. ఆ రాష్ట్ర పునర్నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగానే జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ గిరీశ్ చందర్ ముర్మ గురువారం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారులతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించేందకు కేంద్రం సిద్ధమవుతోందని, వీలైనంత త్వరలోనే ఎన్నికలు జరుగుతాయని అన్నారు. దానికి ఇక్కడి యంత్రాంగం, పౌరులంతా సహకరించాలని, జమ్మూ కశ్మీర్ వ్యవహారాలను ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తోందని అన్నారు. కావును ఎన్నికల ప్రకటనను కేంద్రమే త్వరలో ప్రకటించనుందని అన్నారు. కాగా కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహిస్తారంటూ గతకొంత కాలంగా వార్తలు వినిపిస్తోన్న నేపథ్యంలో.. తాజాగా మూర్మ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంచరించుకుంది. కాగా ఆర్టికల్ 370 రద్దు అనంతరం కశ్మీర్‌ను రెండుగా విభజిస్తూ.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కశ్మీర్‌ను శాసనసభ కలిగిన కేంద్రపాలిత ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించింది. కాగా 2018 జూన్ 20 నుంచి అక్కడ గవర్నర్ పాలన సాగుతోంది.

## చంద్రబాబుపై కోపంతో...

# అమరావతిలో నిర్మాణాలు ఆపేస్తారా?

- రాజధాని పెద్దదిగా అవుతుందని భావిస్తే పరిమాణం తగ్గించాలి
- పులివెందలలో రాజధాని కడుతారా.. ప్రజామోదంతో అదన్నాచేయండి!
- ఏదో ఒక నిర్ణయం తొందరగా తీసుకోండి
- కొత్త పాలసీ పేరుతో కార్మికులను ఇబ్బందులు పెడతారా?
- ఓట్ల కోసం డబ్బులు పంచారు.. కార్మికులకు ప్రభుత్వ సొమ్ము ఎందుకు ఇవ్వరు?
- జనసేన సిద్ధాంతాలు నచ్చిన వాళ్లే పార్టీలో ఉంటారు
- నిబద్ధతతో కలిగిన జనసైనికులతో పార్టీని నడుపుతా

**- జనసేన అధినేత పవన్ కళ్యాణ్**

- ఉచిత అన్నదాతన శిబిరాన్ని ప్రారంభించిన పవన్

అమరావతి, నవంబర్15(ఆర్ఎన్ఎ) : వైకాపా ప్రభుత్వం మూర్ఖపు నిర్ణయాలతో భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలో జనసేన ఆధ్వర్యంలో 'డొక్కా సీతమ్మ ఆహార శిబిరాలు' పేరిట ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన శిబిరాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ శిబిరాల ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఆహారం అందించనున్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు పవన్ కళ్యాణ్ స్వయంగా ఆహారం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబుపై ఉన్న కక్షతో అమరావతిలో నిర్మాణాలు ఆపుచేశారని, అలాంటప్పుడు గత ప్రభుత్వంలో అసెంబ్లీలో రాజధానిపై ఏకగ్రీవ తీర్మాణాకి వైసీపీ ఎందుకు సహకరించినిందని పవన్ ప్రశ్నించారు. ఇసుక వారోత్సవాలను నిర్వహించేందుకు వైకాపా ప్రభుత్వం 5 నెలల సమయం ఎందుకు తీసుకుందని నిలదీశాడు. వ్యవస్థను ప్రక్షాలను చేసేందుకు తీసుకొచ్చిన విధానాలు 50మందిని బలిగొంటాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై మాట్లాడటం వేరు.. వాటికి పరిష్కారం చూపడం వేరని పవన్ అన్నారు. సగటు మనిషి సమాజంలో నిలబడాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని పవన్ చెప్పారు. కార్మికులకు ఒకపూట భోజనంతో పెద్దగా ఏం కాకపోవచ్చుని, కానీ, వారికి ఎంతో కొంత చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాలను ప్రారంభించానని వివరించారు. భవన నిర్మాణ కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని పవన్ కోరారు. ప్రజలను చంపేస్తుంటే మేం మౌనంగా ఉండిపోవాలా అని ప్రశ్నించారు. వైకాపాకు 151 సీట్లు ఇచ్చినందుకు ఇలా చేస్తారా? కొత్త పాలసీ పేరుతో ఇబ్బందులు పెడతారా? వైకాపా నాయకులకు ఆకలిబాధలు తెలుసా అని పవన్ ఘాటుగా ప్రశ్నించారు. వైకాపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి అంగీకరించారని, అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం కూడా చేశారని పవన్ గుర్తు చేశారు. ఇప్పుడు ప్రతిపక్షనేత చంద్రబాబుపై కోపంతో నిర్మాణాలు ఆపేస్తారా? అని పవన్ దుయ్యబట్టారు. రాజధాని పెద్దదిగా అయిపోతోందని భావిస్తే పరిమాణం తగ్గించాలని కోరారు. 30 వేల ఎకరాల్లో కాకుండా 5 వేల ఎకరాల్లో రాజధాని కట్టాలని సూచించారు. రాజధానిపై ఏదో ఒక నిర్ణయం తొందరగా తీసుకోవాలని హితవు పలికారు. పులివెందులలో పెట్టాలనుకుంటే.. ప్రజామోదంతో అదైనా చేయాలని పవన్‌కల్యాణ్ విమర్శించారు. నేను మాట్లాడితే శాపనార్థాలు పెడతానని అంటున్నారని, వైకాపా నేతలకు భోజనం లేకుంటే ఉంటారా అని ప్రశ్నించారు. కార్మికులు 50 మంది చనిపోతే మాట్లాడకుండా ఉండాలా అని పవన్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చిన వాళ్లే పార్టీలో ఉంటారని, ఇష్టం లేనివాళ్లు వెళ్తారని పవన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు నాదెండ్ల మనోహర్, మంగళగిరి ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి రైతులకు న్యాయం చేయాలి

### ములుగు ఎమ్మెల్యే సీతక్క డిమాండ్

వరంగల్,నవంబర్15(ఆర్ఎన్ఎ): పత్తి రైతులకు ఎక్కడా న్యాయం జరగడం లేదని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. పత్తి మార్కెట్లను సందర్శించి వివరాలు తెలుసుకున్నామని అన్నారు. ఎక్కడా గిట్టుబాటు ధరలు అమలు కావడం లేదన్నారు. వ్యవసాయ మార్కెట్లలో రైతుల పంటలకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పత్తి రైతులకు బోనస్ ఇచ్చి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రైతులకు జరిగిన నష్టానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పత్తికి క్వింటాల్‌కు రు.6వేల మద్దతు ధర చెల్లించాలని అనా న్రు. తాము ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే ధర చెల్లిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్లకు వచ్చిన పత్తిలో కేవలం 1.2 శాతమే సీసీఐ కొనుగోలు చేస్తుందన్నారు. మిగతాదివ్యాపారులు, దళారులే కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మరోపక్క మార్కెట్‌కు బస్తాలలో పత్తి తెస్తే కొనుగోలు చేయడం లేదని, లూజు పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తామనడంతో అనేక మంది రైతులు మద్దతు ధర పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగినా మద్దతు ధరలు నామమాత్రంగా పెంచుతున్నారని తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు చేసే విషయంలో మార్క్‌ఫెడ్ అనేక కొర్రీలు పెడుతోందన్నారు. ఇప్పటికైనా సీసీఐ నిబంధనలను కొద్దిగా సడలించాలని కోరారు. రాష్ట్రంలో నకిలీ పత్తివిత్తన వ్యాపారులతో ప్రభుత్వం కుమ్మక్కైందని అన్నారు.

# బలిదానాలతో ఆత్మహత్యల తెలంగాణగా మారింది

### కెసిఆర్ తీరుతో రాష్ట్రం పూర్తిగా దివాళా
### మండిపడ్డ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

వరంగల్,నవంబర్15(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ కార్మికుల బలిదానాలతో తెలంగాణ ఆత్మహత్యల రాష్ట్రంగా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్‌లో ఉండాల్సిన పోలీసులు బస్ డిపోలు, రెవెన్యూ కార్యాలయాల ముందు ఉంటున్నారని ఆరోపించారు. బస్సుల్లో తిరగాల్సిన డ్రైవర్, కండక్టర్ చౌరస్తాల్లో ఆందోళన నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై భుజంపై తుపాకీ పెట్టి ఆర్టీసీ కార్మికులను కాల్చివేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇవాళ కేసీఆర్ తీసుకుంటున్న చర్యల వల్ల రాష్ట్రం పూర్తిగా దివాళా తీస్తుందని, సంక్షేమ కార్యక్రమాలు అటకెక్కుతున్నా యని దుయ్యబట్టారు. మీకు దమ్ముంటే ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 41 రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టించుకోని కేసీఆర్ రెవెన్యూ ఉద్యోగులు ఎక్కడ వారికి మద్దతు తెలుపుతారో అని భయపడి వారితో చర్చలు జరపడం విడ్డూరంగా ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు బీజేపీనే ప్రత్యామ్నాయంగా భావిస్తూ పెద్ద ఎత్తున కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ఆదివాసీ నేత తాటి కృష్ణ లక్ష్మన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. మోదీ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చాక కఠిన నిర్ణయాలు తీసుకుంటుంటే రాష్ట్రంలో మాత్రం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక అశాంతి, అసంతృప్తి నెలకొన్నట్లు వెల్లడించారు. ాఫెల్‌పై రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాఫెల్ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీకి క్లీన్‌చిట్ ఇచ్చినట్లు గుర్తుచేశారు. రాహుల్‌గాంధీ తన కాళ్లకు బలపం కట్టుకొని తిరిగి బీజేపీ నేతలపై బురద జల్లే ప్రయత్నాన్ని ప్రజలు తిరస్కరించారని తెలిపారు. ఇప్పటికైనా రాహుల్‌గాంధీ నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని, తన కుటిల బుద్ధిని మానుకోవాలని పేర్కొన్నారు. ఎంతటి జఠిల సమస్యలనైనా మోదీ సామరస్యంగా పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.

# మధుమేహంపై విద్యార్థులకు అవగాహన

### జయశంకర్ అగ్రి వర్సిటీలో ర్యాలీ

హైదరాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): ప్రపంచ మధుమేహ దినోత్సవాన్నిపురస్కరించుకుని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనిటీ సైన్స్ కళాశాలలోని ఫుడ్స్ అండ్ న్యూట్రిషన్ విభాగం ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా విద్యార్థులకు అవగాహన కోసం ప్రదర్శన కూడా నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ డా. సుధీర్‌కుమార్ ఈ శిబిరాన్ని సందర్శించి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. వీజీ విద్యార్థులు మధుమేహం నియంత్రణ కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలు, ముందస్తుగా పాటించాల్సిన ఆహార అలవాట్లు వంటి పలు అంశాలపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను రిజిస్ట్రార్ పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి బీపి, షుగర్ ,బాడీమాస్ ఇండెక్స్, ఫ్యాట్, బరువు, ఎత్తు పరీక్షలను నిర్వహించారు. పిజిఆర్ఐ వద్ద అవగాహనా ర్యాలీలోనూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. మధుమేహం రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలతో పాటు, వచ్చిన వారు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయంపై పై కూడా కార్యక్రమంలో అవగాహన కల్పించారు. దినసరి ఆహారంలో ఉండాల్సిన ఆహార పదార్థాల మోతాదు పై కూడా లైవ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హోంసైన్స్ డీన్ డా. రత్నకుమారి, పీజీ స్టడీస్ డీన్ డా. మీనాకుమారి, డా. సదాశివరావు, డా. ఆనంద్‌సింగ్, డా. విష్ణువర్ధన్‌రెడ్డి, ఫుడ్స్‌అండ్ న్యూట్రిషన్ హెడ్ డా. హైమవతి తదితరులు పాల్గొన్నారు.

ఈసందర్భంగా మధుమేహం అవగాహనలో భాగంగా విద్యార్థులు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

# వేయిస్తంభాల ఆలయంలో అతిరుద్ర యాగం



హన్మకొండ, నవంబర్ 15 : చారిత్రక వేయిస్తంభాల దేవాలయంలో డిసెంబర్ 15 నుంచి 21 వరకు శృంగేరీపీఠం ఆధ్వర్యంలో అతిరుద్ర యాగం నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. హన్మకొండ వేయిస్తంభాల దేవాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. లోకకల్యాణార్థం సీఎం కేసీఆర్ సూచనల మేరకు ఈ యాగం నిర్వహిస్తుండటం సంతోషకరమన్నారు. భవితశ్రీ చిట్‌ఫండ్స్ ఛైర్మన్ శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, తాటిపెల్లి శ్రీనివాస్, ధర్మప్రచార పరిషత్ ప్రధాన కార్యదర్శి టీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యాగంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వరంగల్ అర్బన్ నగర మేయర్ గుండా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. మానవాళి సుఖసంతోషాలతో ఉండేందుకు అతిరుద్ర యాగం.. గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించడం వరంగల్ ప్రజల అదృష్టమన్నారు.

తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి 200 మంది వేదపండితుల చేతులమీదుగా యాగం అద్భుతంగా నిర్వహిస్తామని చెప్పారు. శృంగేరి స్వామిజీ స్ఫూర్తితో ధర్మప్రచార పరిషత్ సభ్యులను ప్రోత్సహిస్తామని, వారి కార్యక్రమాల్లో భాగస్వాములమవుతామని తెలిపారు. ధర్మప్రచార పరిషత్ అధ్యక్షుడు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ..వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే 200 మంది వేదపండితులతో వారంపాటు అతిరుద్ర యాగం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. భవితశ్రీ చిట్‌ఫండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే యాగానికి ప్రభుత్వం తరుపున అన్ని ఏర్పాట్లుచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అతిరుద్ర యాగానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త మండవ శేషగిరిరావు, కుడా అడ్వైజర్ మాడిశెట్టి శివశంకర్, టీఆర్ఎస్ నాయకులు పులి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జోరు కొనసాగించిన మార్కెట్లు

### పాజిటివ్‌గా ముగిసన సెన్సెక్స్

ముంబై,నవంబర్ 15(ఆర్ఎన్ఎ):: ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలతో స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల జోరు కనిపించింది. ఫైనాన్షియల్, ఐటీ, ఆటోమొబైల్ షేర్లలో కొనుగోళ్ల వెల్లువెత్తడంతో మార్కెట్లు పాజిటివ్ జోన్‌లో కొనసాగాయి. ద్రవ్యోల్బణం స్వల్పంగా పెరిగినా అంచనాలకు అనుగుణంగానే ఉండటంతో డిసెంబర్‌లో ఆర్‌బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తుందనే అంచనా మార్కెట్‌లో సానుకూల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. మొత్తంమీద బీఎస్ఈ సెన్సెక్స్ 170 పాయింట్ల లాభంతో 40,286 పాయింట్ల వద్ద ముగియగా, 30 పాయింట్లు పెరిగిన ఎన్ఎస్ఈ నిఫ్టీ 11,870 పాయింట్ల వద్ద క్లోజయింది. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ, టీసీఎస్ షేర్లు భారీగా లాభపడగా, టెలికాం, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.

# ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభం: శరద్ పవార్



ముంబై, నవంబర్ 15: మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయని ఎన్సీపీ నేత శరద్ పవార్ తెలిపారు. వచ్చే ఐదేళ్ల పూర్తికాలం తమ ప్రభుత్వ పాలన కొనసాగనున్నట్లు ఆయన వెల్లడించారు. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రభుత్వ ఏర్పాటుకు పొత్తు కుదిరిన విషయం తెలిసిందే. పొత్తులో భాగంగా శివసేనకు సీఎం పదవితో సహా 14 మంత్రి పదవులు, ఎన్సీపీకి డిప్యూటీ సీఎం సహా 14 మంత్రి పదవులు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి స్పీకర్‌తో పాటు 12 మంత్రి పదవులు దక్కనున్నాయి.

# మహిళలు శబరిమల రాకపోవడమే మేలు!

### - మేం వారికి భద్రత కల్పించేలాం
### - కేరళ దేవాదాయశాఖ మంత్రి సురేంద్రన్

తిరువనంతపురం, నవంబర్15(ఆర్ఎన్ఎ) : కేరళలోని పత్తినంథిట్ట జిల్లా దట్టమైన అడవుల్లో వెలిసిన అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించడానికి వచ్చే మహిళా భక్తులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది. స్వామివారిని దర్శించడానికి వచ్చే అన్ని వయసుల మహిళలకు రక్షణ కల్పించబోమని తేల్చి చెప్పింది. మహిళలు శబరిమలను సందర్శించడానికి రాకపోవడమే మేలు అని కేరళ దేవాదాయ శాఖ మంత్రి కడకంపల్లి సురేంద్రన్ వెల్లడించారు. ఈమేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.. శబరిమల ఆలయానికి సాధారణ భద్రతను మాత్రమే కల్పిస్తున్నామని, మహిళలు సందర్శించేటట్టయితే వారికి అదనపు భద్రతను కల్పించాల్సి ఉంటుందని చెప్పారు. ఆ పని తాము చేయలేమని తేల్చి చెప్పారు.

శబరిమలలో మహిళల ప్రవేశానికి సంబంధించిన రివ్యూ పిటీషన్ పై దేశ అత్యున్నత న్యాయస్థానం తన తీర్పును పెండింగ్ లో ఉంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అందరి దృష్టి శబరిమల ఆలయంపైనే నిలిచింది. తాను అయ్యప్ప స్వామిని దర్శించుకుంటానని భూమాత బ్రిగేడ్ సంస్థ సామాజిక ఉద్యమకారిణి తృప్తి దేశాయ్ వెల్లడించిన నేపథ్యంలో.. ఇక ఏ స్థాయిలో మహిళలు మణికంఠుడిని దర్శించుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. ఇలాంటి పరిస్థితుల మధ్య శనివారం.. హరిహర పుత్రుడి గుడి తలుపులు తెరచుకోబోతున్నాయి.

## పాలమూరుకు మెడికల్ కాలేజీ వరం: శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,నవంబర్15 (ఆర్ఎన్ఎ): వెనుకబడిన, వలసల జిల్లా పాలమూరుకు తెలంగాణలో మొదటి మెడికల్ కళాశాల రావడం మనకు ఒక వరమని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. గురువారం స్థానికంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంతుబట్టని రోగాలు పెరుగుతున్న ఈ సమయంలో డాక్టర్లు నిత్య విద్యార్థిగా పరిశోధనలు చేయాలని సూచించారు. పేదరికంలో ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. అలాగే, మెడికల? కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేసి సహకరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

# హమాలీ ఛార్జీలు రైతుల ఖాతాలో జమచేయాలి: మంత్రి హరీశ్

సంగారెడ్డి:, నవంబర్15 (నేటినిజం ప్రతినిధి) హమాలీ ఛార్జీలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులనను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో మంత్రి హరీశ్‌రావు నేడు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గోంగులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సుతిలీ తాళ్లు రైతులే తెచ్చుకోవాలన్న బోర్డును చూసి మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హమాలీ బిల్లులు ఖాతాల్లో జమ కావడం లేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రైతుల సమస్యలు పరిష్కరించాలని మంత్రి అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో సుతిలీ తాళ్లు ఉచితంగా రైతులకు ఇవ్వాలన్నారు. హమాలీ ఛార్జీలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

# పాఠశాల బస్సు బోల్తా.. తప్పిన ప్రమాదం



హైదరాబాద్, నవంబర్ 15: నగరంలోని మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ రోడ్డులో పాఠశాల బస్సు బోల్తా పడింది. స్వేచ్ఛ ద కంప్లీట్ స్కూల్‌కు చెందిన బస్సు బ్రేక్ పట్టేయడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో పాఠశాల విద్యార్థులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

జనగామ,నవంబర్15(ఆర్ఎన్ఎ): జిల్లాలోని లింగాలఘన్‌పూర్ మండలం వనపర్తి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. టాటాఏస్ వాహనం బైక్‌ను ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో తండ్రి మృతి చెందగా, కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడు దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి వాసిగా గుర్తించారు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తిరిగి వినియోగించే ఇన్సులిన్ సూదులతో ముంచుకొస్తున్న ముప్పు

### మధుమేహ వ్యాధి. గ్రస్తులకు ఓ హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్, 15: గత రెండు దశాబ్దాలలో భారతదేశం డయాబెటిస్ ఉదంతాల్లో భయంకరమైన పెరుగుదలను చూసింది. 2017 లో 72.9 మిలియన్ కేసులతో దేశం ప్రపంచ డయాబెటిస్ భారంలో 49 శాతాన్ని సూచిస్తుంది, ఈ సంఖ్య 2025 నాటికి రెట్టింపు అయి దాదాపు 134 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. భారతదేశంలో సాంక్రమికేతర ప్రధాన వ్యాధులలో ఒకటైన డయాబెటిస్ ఒక సంవత్సరం లో అర మిలియన్ మరణాలకు కారణమవుతోంది.

డయాబెటిస్ నిర్వహణలో ఇన్సులిన్ చికిత్స అనేది తరచుగా ఎంతో కీలక భాగంగా ఉంటుంది. డయాబెటిస్‌తో బాధపడుతున్న వారిలో 35 శాతం మంది ప్రస్తుతం ఇన్సులిన్‌పై ఉన్నారు. టైప్ 1 డయాబెటిస్ ఉన్నవారిలో ఇన్సులిన్ చికిత్సకు ప్రధానమైనది. టైప్ 2 ఉండి, నోటి మాత్రలు, ఆహారం, వ్యాయామం ద్వారా నియంత్రించ బడని వారికి రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడానికి, హృదయ సంబంధ వ్యాధులు, స్ట్రోక్, పెరిఫెరల్ వాస్కులర్ డిసీజ్, కిడ్నీ వంటి వ్యాధి నుండి దీర్ఘకాలిక సమస్యలను నివారించడానికి ఇన్సులిన్ ఇంజెక్షన్లు అవసరం కావచ్చు. మంచి గ్లైసెమిక్ నియంత్రణ, ఆహారం, వ్యాయామం మరియు ఇన్సులిన్‌ను సరిగ్గా తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చు.ఇన్సులిన్ థెరపీపై రోగులలో డయాబెటిస్ యొక్క సరైన నియంత్రణను సాధించడంలో ఇంజెక్షన్ టెక్నిక్ చాలా ముఖ్యమైనది. సరైన రీతిలో ఇన్సులిన్ శోషణ కోసం, కండరాని గాకుండా చర్మం కింద ఉన్న కొవ్వు పొరలో ఇన్సులిన్ ఇంజెక్ట్ చేయాలి. ప్రతి ఇంజెక్షన్ కోసం ప్రతిసారీ చర్మంపై కొత్త చోటు ఉపయోగించడం కూడా చాలా ముఖ్యం. ఒకే చోటు లోకి పదేపదే ఇంజెక్ట్ చేయకూడదని, అంతేగాకుండా ఒకసారి ఉపయోగించిన తరువాత సూదిని మార్చాల్సిందిగా సిఫార్సు చేయబడింది. ఇన్స్టిట్యూట్ ఆఫ్ డయాబెటిస్ ఎండోక్రినాలజీ అండ్ అడిపోసిటీ (ఐడిఇఎ క్లినిక్స్, హైదరాబాద్) డైరెక్టర్, ఎండోక్రి నాలజిస్ట్ డాక్టర్ శ్యాం కలవపల్లి ఈ సందర్భంగా మాట్లాడుతూ, "రోగులకు చికిత్స ఫలితాలను నిర్ణయించడంలో మందులను వేళకు వేసుకోవడం ఒక ప్రధాన అంశం. భారతదేశంలో, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక నిర్వహణ వ్యాధుల నిర్వహణలో ఇది ప్రత్యేకంగా వర్తిస్తుంది. చికిత్స ప్రభావవంతంగా ఉండటానికి, దానిని సరిగ్గా తీసుకోవాలి మరియు రోగులు ప్రతి ఇంజెక్షన్ కోసం కొత్త సూదిని ఎందుకు ఉపయోగించాలో అర్థం చేసుకోవాలి. హైదరాబాద్‌లో, ఎక్కువ మంది రోగులు తమ ఇన్సులిన్ సిరంజిలు, పెన్ సూదులను తిరిగి ఉపయోగిస్తున్నారు. చాలా మంది రోగులకు ఇన్సులిన్ సూదులు సింగిల్-యూజ్ డిస్పోజబుల్ సూదులు అని కూడా తెలియదు. ఐడిఇఎ క్లినిక్‌ల యొక్క మా 10 కేంద్రాల్లోని మా నిపుణుల బృందం, రోగికి సరైన ఇన్సులిన్ తీసుకునే పద్ధ తులపై మార్గనిర్దేశం చేయడానికి, లిపోహైపెర్ట్రోఫీపై అవగాహన కల్పించడానికి మరియు సూదులను తిరిగి ఉపయోగించడాన్ని నిరోధించడానికి చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. మెరుగైన ఇంజెక్షన్ టెక్నిక్‌తో మంచి గ్లైసె మిక్ నియంత్రణను రోగి పొందినప్పుడు వారు చికిత్సను మరింత మెరుగ్గా కొనసాగిస్తారు" అని అన్నారు.

## కరీంనగర్‌లో రోడ్డు ప్రమాదం..

# ఇద్దరు యువకుల మృతి

కరీంనగర్, నవంబర్15(నేటినిజం ప్రతినిధి) : కరీంనగర్ జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.

అలుగునూరు వద్ద చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న యువకులు మృత్యువాతపడ్డారు. వీరిని అలుగునూరుకు చెందిన సాయి కిరణ్ (20), సాయికృష్ణ (21)గా గుర్తించారు.

ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. లారీని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించినట్టు పోలీసులు తెలిపారు. ప్రమాదం గురించి తెలిసిన మృతుల కుటుంబసభ్యులు, బంధువులు పెద్ద ఎత్తున్న అక్కడకు చేరుకోవడంతో ఆ ప్రాంతమంతా రోదనలతో మిన్నంటింది.

చేతికందొచ్చిన పిల్లలు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీటపర్యతమవుతున్నారు.

అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధరించారు.

వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చింది.

## కలుషిత నీరు తాగి ఇద్దరు చిన్నారుల మృతి

హైదరాబాద్,నవంబర్15(ఆర్ఎన్ఎ): రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమ్ఎమ్ పహాడీలో విషాద ఘటన చోటుచేసుకుంది. కలుషిత నీరు త్రాగి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఒకేసారి ఇద్దరు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ అధికారుల తీరు పై స్థానికులు మండిపడుతున్నారు. త్రాగే నీరులో కలుషిత నీరు కలుస్తుందని అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ స్పందించలేదని వాపోతున్నారు. రెండు విభాగాల అధికారులే తమ బిడ్డలను పొట్టన పెట్టు కున్నారంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్ సీజన్‌లో వచ్చిపోయే దోమ !

### - ట్విటర్‌లో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

అమరావతి, నవంబర్15(ఆర్ఎన్ఎ) : చంద్రబాబు ఇసుక దీక్షపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. అలాగే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై కూడా విమర్శలు చేశారు. ఇంకా విజయసాయిరెడ్డి తన ట్విట్టర్ ఖాతా ద్వారా పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి.. నిత్యాకళ్యాణం గురించి సోషల్ మీడియాలో ఈ విధంగా అనుకుంటున్నారని.. సీజన్‌లో వచ్చేపోయే డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాప్తి చేసే దోమ లాంటి వారని. వర్షాకాలంలో ఎగిరెగిరి పడుతూ, శీతాకాంలో చల్లబడి, వేసవిలో కనిపించకుండా పోతారని అన్నారు. ఇంకా మట్లడుతూ.. ఇన్నాళ్లు దోమలకు నడిచిందేమో కాని ఇక పై దోమలకు కష్టకాలమే అంటూ ట్వీట్ చేశారు. ఇంకా చంద్రబాబు చేసిన ఇసుక దీక్షపై కూడా తనదైన శైలిలో స్పందించారు. ఇసుక కొరత తీర్చాలంటూ చేసిన దీక్షలో మెడకు ఇసుక పొట్లాల దండ వేసుకున్న చంద్రబాబు ఎప్పుడైనా కరువు పైన దీక్ష చేయాల్సి వస్తే ఎముకల దండ వెసుకుంటామోనని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు ఫ్రస్టేషన్లో ఏం చేస్తున్నారో తెలియడం లేదని ఫ్లెక్సీలు, పోస్టర్లు, జెండాలు కట్టినంత మంది కూడా దీక్షకు రాలేదని అన్నారు.

## ఆర్టీసీ సమ్మె భవితవ్యంపై జెఏసి భేటీ

హైదరాబాద్,నవంబర్ 15(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మె..కార్మికుల ఆత్మహత్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఆర్టీసీ కార్మిక సంఘాల ఐకాస, అఖిలపక్ష నేతలు భేటీ అయ్యారు. ఈయూ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆర్టీసీ ఐకాస కన్వీనర్ అశ్వత్థామరెడ్డి, కోకన్వీనర్ రాజిరెడ్డితో పాటు తెజస అధ్యక్షుడు కోదండరాం, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ వీహెచ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ, సీనియర్ నేత రావుల చంద్రశేఖర్‌రెడ్డి, భాజపా నేత మోహన్‌రెడ్డి, సీపీఐ నేతలు పల్లా వెంకట్‌రెడ్డి, సుధాకర్ తదితరులు హాజరయ్యారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెలో భాగంగా చేపట్టనున్న సడక్ బంద్ కార్యక్రమంపై నేతలు చర్చిస్తున్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com